KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :84 | శనివారం , 22 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# హైడ్రాను మూసేయమంటారా?

**- హైకోర్టు**



హైదరాబాద్ లో నిర్మాణాల కూల్చివేతలో హైడ్రా అనుసరిస్తున్న తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రాను అడ్డుపెట్టుకుని కొంతమంది వ్యక్తిగత కక్షలతో ఆరోపణలు చేస్తున్నారని...వాటి ద్వారా హైడ్రా కూల్చివేతలకు పాల్పడడం సరికాదంది కోర్టు. కేవలం పత్రాలను చూసి నిర్మాణం హక్కులను ఎలా తేలుస్తారని అడిగింది. అసలు హైడ్రాకు హక్కులను నిర్ణయించే అధికారం ఎవరిచ్చారని కోర్టు మండిపడింది. నోటీసులు జారీ చేసి.. వివరణ ఇచ్చేందుకు తగిన గడువు ఇచ్చి.. చట్టప్రకారం కూల్చివేతలు చేపట్టాలని చెప్పినా.. ఎందుకు చేయడం లేదని ప్రశ్నించింది. ఇలా అయితే జీవో 99ను రద్దు చేసి హైడ్రాను మూసేయాల్సి వస్తుందని హైకోర్టన్ హెచ్చరించింది.

2 లో

# రాజాసింగ్‌కు మెటా షాక్..




## ఫేస్‌బుక్, ఇన్‌స్టా అకౌంట్లు బ్లాక్

బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్‌కు ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ మెటా షాకిచ్చింది. ఆయనకు సంబంధించిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను తొలగించింది.

2 లో

## కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య

# వాటర్ వార్



తెలంగాణలో లేటెస్టుగా 'వాటర్ వార్' మొదలైంది. అధికార, ప్రతిపక్షాల మధ్య మొదలైన వాటర్ వార్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై మరొకటి ఆరోపణలతోవిరుచుకుపడుతున్నాయి . విచిత్రం ఏమిటంటే రెండుపార్టీలూ తప్పులే చేస్తున్నాయి. బీఆర్ఎస్ పాలనలోనే నీటికేటాయింపులు, నీటివాడకానికి తెలంగాణకు అన్యాయం జరిగిందని రేవంత్, మంత్రులు ఆరోపిస్తుంటే, రేవంత్ చేతకానితనంవల్లే తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతోందని మాజీ నీటిపారుదలశాఖ మంత్రి హరీష్ రావు ప్రతిరోజు ఆరోపణలతో విరుచుకుపడుతున్నారు.

గడచిన మూడునెలలుగా కృష్ణానది జలాల నుండి ఏపీ ప్రభుత్వం ప్రతిరోజు 10వేల క్యూసెక్కుల నీటిని అక్రమంగా వాడేసుకుంటోందని హరీష్ ఆరోపిస్తున్నారు. వాటాకు మించి ఏపీ ప్రభుత్వం నీటిని వాడేసుకుంటున్నా రేవంత్ చోద్యంచూస్తున్నారని మాజీమంత్రి ధ్వజమెత్తుతున్నారు.
చంద్రబాబునాయుడుతో రేవంత్ కున్న వ్యక్తిగత సంబంధాలవల్లే ఏపీప్రభుత్వం పరిమితికిమించి నీటినివాడుకుంటున్నా రేవంత్ కావాలనే పట్టించుకోవటంలేదన్నది హరీష్ ఆరోపణ. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం కళ్ళుతెరిచి ఏపి జలదోపిడీని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం జలదోపిడీని అడ్డుకునేంత సీన్ ఒంటరిగా రేవంత్ ప్రభుత్వానికి లేకపోతే కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్(కేఆర్ఎంబీ) ముందు ధర్నా చేయటానికి తాము వస్తామని హరీష్ బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు.

ఈ ఏడాది కృష్ణానదిలో 1010 టీఎంసీల నీళ్ళున్నట్లు చెప్పారు. తాత్కాలిక ఒప్పందం 66:34 నిష్పత్తి ప్రకారం ఏపీకి దక్కాల్సిన నీరు 666 టీఎంసీలు మాత్రమే అన్నారు. అయితే ఇప్పటికే 657 టీఎంసీల నీటిని వాడేసుకున్న ఏపీ ప్రభుత్వం ఇకముందు కూడా ఇదేపద్దతిలో నీటిని వాడుకునేందుకు రేవంత్ సహకరిస్తున్నట్లు ఆరోపించారు. వేసవి మొదలుకాకముందే ఇన్ని వందల టీఎంసీల నీటిని వాడేసుకున్న ఏపీ ప్రభుత్వం వేసవి మొదలైన తర్వాత మరింత నీటిని వాడుకోకుండా ఉంటుందా అని హరీష్ ప్రశ్నించారు. లెక్కప్రకారం తెలంగాణకు 343 టీఎంసీల నీరు అందాలన్నారు. అయితే ఇప్పటికి తెలంగాణ ప్రభుత్వం వాడుకున్నది కేవలం 220 టీఎంసీల నీరుమాత్రమే అని చెప్పారు. నీటి లభ్యత ఉన్నపుడు 343 టీఎంసీల నీటిని తెలంగాణ ప్రభుత్వం ఎందుకు వాడుకోవటంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

2 లో

# అవినీతికి పెద్దపీట వేశారు..

## • సీఎం రేవంత్‌పై కిషన్‌రెడ్డి ఫైర్



తెలంగాణను కేసీఆర్ కుటుంబమంతా దోచుకుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మార్పు తెస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని కానీ ఆచరణలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి.. ప్రకటనలు ఫస్ట్ పేజీల్లో ఉన్నాయి.. పనులు మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రుల్లో సఖ్యత లేదని చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు రానుందని జోస్యం చెప్పారు. శుక్రవారం మెదక్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మాత్రమే అన్ని స్థానాలకు పోటీచేస్తుందని స్పష్టం చేశారు.

2 లో

# కేసీఆర్

## అసెంబ్లీకి వచ్చేలా ఆర్డర్ ఇవ్వండి

**- హైకోర్టులో ప్రజా ప్రయోజన పిటిషన్**




2 లో

తెలంగాణలో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి, ఓడిపోయినప్పటి నుంచి ప్రజలకు కనిపించకుండా పోయిన కేసీఆర్.. కనీసం అసెంబ్లీకి కూడా రాకపోవడంపై అనేక విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయనను అసెంబ్లీకి వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రతీ ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ప్రజల సమస్యల్ని, వారి ప్రాంత బాగోగుల్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని, అలాంటి పని చేయనప్పుడు వారికి పదవులు ఎందుకని పిటిషనర్ ప్రశ్నించారు.

# అందరికీ రుణమాఫీ అదో అందమైన కట్టుకథ

**-హరీశ్‌రావు**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. గాంధీ భవన్ వద్ద ధర్నాకు దిగిన రైతు విషయంలో హరీశ్‌రావు స్పందించారు .అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మిమ్మల్ని నిలదీసేందుకు తుంగతుర్తి నుంచి గాంధీ భవన్ దాకా వచ్చిన రైతు తోట యాదగిరి గారికి ఏం సమాధానం చెబుతారు అని హరీశ్‌రావు నిలదీశారు.



2 లో

# గ్రేటర్ హైదరాబాద్.... గ్రేటర్ సికింద్రాబాద్?

**రెండుగా చీలిపోనున్న హైదరాబాద్..రెండు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ**




గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని రెండు మహానగర కార్పొరేషన్లు చేయాలని తెలంగాణ సర్కారు దాదాపు ఓ నిర్ణయానికి వచ్చింది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు ఉన్న మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, కొన్ని గ్రామాలను బల్దియాలో కలిపి మెగా కార్పొరేషన్? ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తొలుత భావించిం ది. నగరాన్ని సమ్మిళిత అభివృద్ధి దిశగా నడిపించేందుకు విలీనం ద్వారానే సాధ్యమని ప్రభుత్వం అంచనాకు వచ్చింది. అయితే ఒకే కార్పొరేషన్ చేస్తే సాంకేతికంగా ఇబ్బంది ఎదురవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. రెండు కార్పొరేషన్ల ఏర్పాటు వైపు ఆయన మొగ్గు చూపినట్టు సమాచారం. దీంతో హైదరాబాద్ రెండుగా చీలిపోనున్నది. జీహెచ్ ఎంసీ రెండు కార్పొరేషన్లుగా విడిపోనున్నది.

2 లో

# నేటిమాట

"నీకావాల్సిన మార్పును ముందు నీలోనే తీసుకురా. ప్రపంచాన్ని మార్చాలనుకుంటే, మొదట నీతో ప్రారంభించు."



-మహాత్మా గాంధీ

# తాజ్ బంజారా హొటల్ సీజ్

హైదరాబాద్‌లో గల లగ్జరీ హొటల్ తాజ్ బంజారాకు జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ) అధికారులు షాక్ ఇచ్చారు. ఆ హొటల్‌ను సీజ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా పన్ను చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.




2 లో

# మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు అవమానం..!



2 లో

గుమ్మడి నర్సయ్య.. ఈ పేరు వినగానే సాధారణ జీవితం.. సాదాసీదాగా ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా ఉండే నేత. బస్సులు, ఆటోలో సామాన్య వ్యక్తిలా ఎక్కడికైనా వెళుతుంటారు. అవసరమైతే రోడ్డుపై నడుస్తూ వెళతారు. కాన్వాయ్‌లు, గన్‌మెన్స్, అనుచరులు హడావుడి ఇలా ఏమి ఉండదు. ఇల్లందు నుంచి ఐదుసార్లు సిపిఐ(ఎమ్ఎల్) తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయినా సామాన్య వ్యక్తిలా ఉంటారు. అలాంటి నేతకు అవమానం జరిగిందా..?

# కాళేశ్వరం ప్రాజెక్ట్

## అవినీతి కేసు వ్యవహారంలో కీలక పరిణామం



కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని భూపాలపల్లి కోర్ట్ ఇచ్చిన ఆర్డర్‌ను కేసీఆర్, హరీష్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై శుక్రవారం న్యాయస్థానంలో విచారణ జరిగింది.

2 లో

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



### కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య

# వాటర్ వార్

మొదటి పేజీ తరువాయి

పరిమితికి మించి ఏపీ ప్రభుత్వం నీటిని వాడేసుకుంటున్న విషయం తెలిసీ, నీటిలభ్యత ఉన్నపుడే వాడుకోవాలని తెలిసి కూడా రేవంత్ ప్రభుత్వం ఎందుకు ఉపేక్షిస్తోందో అర్ధంకావటంలేదన్నారు. తెలంగాణ సాగు, తాగు అవసరాలకు నీరు అవసరమైనపుడు కృష్ణానదిలో నీరులేకపోతే అప్పుడు కాంగ్రెస్ సర్కార్ ఏమిచేస్తుందని హరీష్ నిలదీశారు. నాగార్జున్ సాగర్ ఎడమకాల్వ కింద 6.38 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్న విషయాన్ని హరీష్ వివరించారు. అవసరమైనంత నీరిస్తే కాని పంటలు పండవన్నారు. ఖమ్మం, మహబూబ్ నగర్, నల్గొండ, హైదరాబాద్ జనాలు మంచినీటికోసం సాగర్ జలలపైనే ఆధారపడినట్లు చెప్పారు. రైతుల పంటలు పండాలన్నా, పై జిల్లాల్లోని ప్రజల తాగునీటికి ఇబ్బందులు రాకూడదంటే వెంటనే సాగర్ కుడికాల్వకు, ముచ్చుమర్రి నుండి తోడుతున్న నీటిని, పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ తరలించుకుంటున్న నీటిని తక్షణమే తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలని హరీష్ డిమాండ్ చేశారు.

## ఏపీ జలదోపిడీకి సహకరించిందే కేసీఆర్ - ఉత్తమ్

హరీష్ రావు ఆరోపణలకు, ప్రశ్నలకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియ సమావేశంలో సమాధానమిచ్చారు. మంత్రి ఏమన్నారంటే ఏపీ జలదోపిడీకి సహకరించిందే కేసీఆర్ ప్రభుత్వమన్నారు. తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నపుడే ఏపీ జలదోపిడీకి తెరలేపిందని మండిపడ్డారు. జగన్ తో కేసీఆర్ కున్న సంబంధాల కారణంగా అప్పట్లో సాగర్ జలాలను ఏపీ ప్రభుత్వ యధేచ్చగా తరలించుకుపోయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. జగన్ సీఎంగా ఉన్నంతకాలం ఏపీ ప్రభుత్వం ప్రతిరోజు 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించుకున్న విషయాన్ని రికార్డులతో సహ ఉత్తమ్ వివరించారు. నిబంధనలను ఉల్లంఘించి జగన్ ప్రభుత్వం రోజుకు పదివేల క్యూసెక్కుల నీటిని తరలించుకుపోతుంటే కేసీఆర్ ఏమిచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పట్లో నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీష్ ఏపీ ప్రభుత్వం జలదోపిడీపై ఎందుకు నోరిప్పలేదని మండిపడ్డారు.

నీటివాడకం విషయంలో కేసీఆర్ హయాంలోనే తెలంగాణకు జరగకూడనంత అన్యాయం జరిగిందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలోనే ఏపీప్రభుత్వం జలదోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకునుంటే ఇప్పుడు సమస్య వచ్చేదికాదన్నారు. ఉత్తమ్ వాదన ఎలాగుందంటే అప్పట్లో కేసీఆర్ తప్పుచేశారు కాబట్టి ఇపుడు తామూ అదే తప్పుచేస్తామని సమర్ధించుకుంటున్నట్లే ఉంది. జలదోపిడీని అరికట్టేందుకు, జలదోపిడీని శాస్త్రీయంగా తేల్చేందుకు సాగర్ ప్రాజెక్టులో టెలిమెట్రీ పరికరాలను కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు అమర్చలేదో వివరించాలని హరీష్ ను ఉత్తమ్ డిమాండ్ చేశారు. టెలిమెట్రీ పరికరాలను అమర్చకుండా ఏపీ ప్రభుత్వం నీటిదోపిడీకి కేసీఆర్, హరీష్ యధేచ్చగా సహకరించి ఇపుడు తమప్రభుత్వంపై బురదచల్లితే ఉపయోగం ఏమిటని ఉత్తమ్ మండిపడ్డారు. కృష్ణాజలాల్లో వాట 299 టీఎంసీలు సరిపోతాయని రాతమూలకంగా కేఆర్ఎంబీకి రాసిచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే కదాని ఉత్తమ్ లాజిక్ లేవనత్తారు.

## ఏపీకి పూర్తి హక్కులు - చంద్రబాబు

ఏపీప్రభుత్వం జలదోపిడీచేస్తోందన్న హరీష్ ఆరోపణలపై చంద్రబాబునాయుడు స్పందించారు. సాగర్ జలాల్లో ఏపీకి రావాల్సిన వాటాను మాత్రమే ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. ఏపీకి దక్కాల్సిన నీటివాటాను నూరుశాతం ఉపయోగించుకుంటామని చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలను ఉపయోగించుకునేందుకు ఏపీకి పూర్తి హక్కులున్నాయన్నారు. ఎలాగంటే పైరెండు నదుల నీటిని ఉపయోగించుకునే రాష్ట్రాల్లో ఏపీనే టైలెండ్ స్టేట్ అని గుర్తుచేశారు. మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ వాడుకోంగా మిగిలిన నీరు మాత్రమే ఏపీలోకి ప్రవేశించి చివరకు సముద్రంలో కలుస్తోందన్న విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. సముద్రంలో వృధాగా కలుస్తున్న నీటిని ఏపీ వాడుకుంటే తప్పేమిటని చంద్రబాబు ఎదురు ప్రశ్నించారు.

## కాంగ్రెసు - బిఆర్ఎస్ తీరుతో తెలంగాణకి అన్యాయం

కృష్ణా జలాల వాడకం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీద హరీష్ రావు, కేసీఆర్ హయాంలో జరిగిన విషయాలపై మంత్రి ఉత్తమ్ ఆరోపణలను గమనిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. అదేమిటంటే అప్పట్లో కేసీఆర్ అయినా ఇప్పుడు రేవంత్ అయినా ఒకే తప్పు చేస్తున్నారని తెలుస్తోంది. కేసీఆర్ హయాంలో జగన్ అడ్వాంటేజ్ తీసుకుంటే, రేవంత్ హయాంలో చంద్రబాబు అవకాశం తీసుకుంటున్నారన్న విషయం పరస్పర ఆరోపణల్లో బయటపడుతోంది. పాలకులు తమ అనుకూల వారు ఆంధ్ర ప్రదేశ్ లో అధికారంలో ఉన్నప్పుడు కిమ్మనకుండా ఉండడం వాళ్ళ తెలంగాణకు అన్యాయమే జరుగుతుంది. ఇప్పటికైనా అధికారంలో ఎవరున్నా తెలంగాణ ప్రయోజనాల కోసమే పనిచేయాలి కానీ అక్కడున్న ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకొని తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టకూడదు

# హైడ్రాను మూసేయమంటారా?

### - హైకోర్టు

మొదటి పేజీ తరువాయి

### సరిగ్గా పరిశీలించకుండానే..

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో తన స్థలానికి సంబంధించి సమర్పించిన వివరాలను పరిశీలించకుండా షెడ్‌ను కూల్చివేశారని హైకోర్టులో ఎ.ప్రవీణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. దీనికి హైడ్రా ఇనెస్పెక్టర్ రాజశేఖర్ హాజరయ్యారు. జస్టిస్ లక్ష్మణ్ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా రాజశేఖర్, ఆయన తరుపు న్యాయవాది..పార్కు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారంటూ గాయత్రి మెంబర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కూల్చివేతలు చేపట్టిందని తెలిపారు. అంతకు ముందు పంచాయతీ కార్యదర్శిని బెదిరించి అనుమతులు తీసుకున్నారని, తర్వాత ఆ అనుమతులను రద్దు చేస్తూ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అన్ని పత్రాలను పరిశీలించిన తర్వాతే హైడ్రా చర్యలు చేపట్టిందని తెలిపారు. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే చట్టపరమైన ప్రక్రియ ద్వారా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

దీనిపై జస్టిస్ లక్ష్మణ్ అసహనం వ్యక్తం చేశారు. తాను 20కి పైగా ఇలాంటి ఉత్తర్వులు జారీ చేశానని..అయినా పిటిషన్లు వస్తూనే ఉన్నాయని అన్నారు. 2023లో అనుమతులు మంజూరు చేస్తే 2025లో ఎలా రద్దు చేస్తారని, ఇన్నేళ్లు ఏం చేశారని నిలదీశారు. గాయత్రి మెంబర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదుతో చర్యలు చేపట్టామని ఇప్పుడు చెబుతున్నారు...కానీ అదే అసోసియేషన్ హైడ్రా కన్నా ముందు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. పార్కు ఆక్రమణ జరుగుతుంటే అప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని అడిగారు. వీళ్ళందరూ ఇప్పుడు కావాలనే హైడ్రాను వాడుకుంటున్నారని జడ్జి వ్యాఖ్యానించారు. తాను పిటిషనర్ ను సమర్థించడం లేదని.. కానీ హైడ్రా అధికారులు చట్టప్రకారం ముందుకు వెళ్ళడం లేదని అన్నారు. ప్రస్తుతం పిటిషనర్‌కు చెందిన స్థలంలో యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రాను ఆదేశిస్తూ.. విచారణను మార్చి 5కి వాయిదా వేశారు.



# తాజ్ బంజారా హోటల్ సీజ్

మొదటి పేజీ తరువాయి

గత రెండు సంవత్సరాలుగా పన్ను చెల్లించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హోటల్ ప్రధాన ద్వారానికి తాళం వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై గతంలో అనేక సార్లు నోటీసులు ఇచ్చినా కూడా తాజ్ బంజారా నిర్వహకులు స్పందించకపోవడంతోనే సీజ్ చేయాల్సి వచ్చిందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ తాజ్ బంజారా లగ్జరీ హోటల్‌బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 1లో ఉంది. ఈ హోటల్‌లో నుంచి రావాల్సిన 1.43 కోట్ల ప్రాపర్టీ ట్యాక్సుం పెండింగ్‌లో ఉందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. హోటల్ యాజమాన్యానికి అనేకసార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు స్పందించలేదని, చివరిసారిగా రెండు రోజుల గడువు ఇచ్చినా కూడా హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. బకాయిలు చెల్లించడానికి హోటల్ యాజమాన్యానికి అనేక అవకాశాలు ఇచ్చామని కూడా అధికారులు తెలిపారు. అయితే కొంత కాలంగా నగరంలోని వాణిజ్య సంస్థల నుంచి పన్ను వసూలుపై జీహెచ్ఎంసీ గట్టి ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే.ఇక ఈ ఘటనపై తాజ్ హోటల్ యాజమాన్యం స్పందించింది. రెండేళ్లుగా పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు తాజ్ బంజారాను సీజ్‌చేసి వారెంట్ ఇష్యూ చేయడంతో హుటాహుటిన హోటల్ నిర్వాహకులు స్పందించారు. జీహెచ్ఎంసీకి బకాయి పడిన కోటీ 43 లక్షల రూపాయల పన్నులో సగం చెల్లించింది. ఆర్టీజీఎస్ ద్వారా పన్ను చెల్లించినట్లు సమాచారం. మిగతా బకాయిలను వారంలోగా చెల్లించేందుకు ఒప్పుకున్నారు. అయితే తాజా బంజారానే కాకుండా ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్‌లో భాగంగా డిఫాల్టర్స్ అందరికీ నోటీసులు పంపింది జీహెచ్ఎంసీ. మూడేళ్లుగా పన్ను చెల్లించనివాళ్లకు వారెంట్స్ ఇష్యూ చేశారు. అందులో భాగంగానే తాజ్ బంజారాకి కూడా నోటీసులు ఇచ్చారు. రెడ్ నోటీస్ ఇష్యూ చేయడంతో తప్పని పరిస్థితుల్లో సగం పన్ను చెల్లించింది తాజ్ బంజారా యాజమాన్యం.




# ఐదుసార్లు ఎమ్మెల్యే.. సాధారణ జీవితం..

### మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు అవమానం..!




ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుద్దామని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే దీనిపై పెద్ద దుమారమే చెలరేగింది. అటువంటి నేతకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా గేట్ దగ్గర అడ్డుకుంటారా.. అని సోషల్ మీడియాలో పలువురు ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్ మెంట్ ఇవ్వక పోవడంపై మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సార్లు అఖిల పక్షం తో వెళితే కలవలేదని, ఇటీవల సీఎం ఇంటికి కలుద్దామని ఒక్కడినే వెళ్లినా.. అనుమతి లేదని, గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు, పోడు భూములు, సాగునీటి సమస్యలు చెప్పుకుందామని వెళ్ళానని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు. ప్రజల సమస్యలనే మేము ప్రభుత్వాలు, సీఎం దృష్టికి తీసుకు వెళతామన్నారు. వ్యక్తిగత సమస్యలు ఏముంటాయన్నారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో కేసీఆర్ ను కలిసే అవకాశం ఇవ్వలేదు. గత మంత్రులకు అనేక సమస్యలపై చెప్పి విసుగు వచ్చింది. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గెలుపులో మేము కూడా కృషి చేశామని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు కోసం వెళ్ళే మమ్మల్ని ఈ విధంగా అడ్డుకుని అవమానించడం సరికాదన్నారు గుమ్మడి నర్సయ్య.

ఎర్రటి ఎండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మడి నర్సయ్య పడిగాపులు కాశారు. ప్రజా సమస్యలు చెబుతామని 4 సార్లు దీనంగా నిలబడ్డారు. అయినా సీఎం కాన్వాయ్ చూసినట్లుగా ముందుకు వెళ్లిపోయింది. కలుసుకునేందుకు సీఎం అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రాజాసింగ్‌కు మెటా షాక్..

### ఫేస్‌బుక్, ఇన్‌స్టా అకౌంట్లు బ్లాక్



బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్‌కు ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ మెటా షాకిచ్చింది. ఆయనకు సంబంధించిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను తొలగించింది. ఆయన పేరుతో ఉన్న రెండు ఫేస్‌బుక్ పేజీలు, మూడు ఇన్‌స్టా అకౌంట్లను తొలగించింది. సోషల్ మీడియాలో ద్వేష పూరిత ప్రసంగాలను వ్యాప్తి చేస్తున్నట్లు ఇండియా హేట్ ల్యాబ్ నివేదిక వెల్లడించిన వారం తర్వాత మెటా ఈమేరకు చర్యలు తీసుకున్నది. తొలగించిన ఫేస్‌బుక్ గ్రూపుల్లో సుమారు 10 లక్షల మందికిపైగా సభ్యులు ఉండగా, ఇన్‌స్టా అకౌంట్లలో లక్షా 55 వేల మందికిపైగా ఫాలోవర్లు ఉన్నారు.

కాగా, 2020లోనే తన ప్లాట్‌ఫామ్స్ నుంచి రాజాసింగ్‌పై మెటా నిషేధం విధించింది. అయితే ఆయన మద్దతుదారులు కొత్త మార్గాల ద్వారా గ్రూపులు, పేజీలను సృష్టించారు. వాటిలో ఎప్పటికప్పుడు రాజాసింగ్‌కు చెందిన ప్రసంగాలు, కార్యాకలాపాలకు సంబంధించిన వివరాలు షేర్ చేస్తున్నారు. అయితే ఇటీవల ఆయన రెచ్చగొట్టేలా పెట్టిన కొన్ని పోస్టులే నిషేధానికి కారణమని తెలుస్తున్నది.

2024 లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఏప్రిల్, జూన్ నెలల మధ్య బీజేపీ సీనియర్ నాయకులు చేసిన 266 మైనారిటీ వ్యతిరేక ద్వేషపూరిత ప్రసంగాలు అధికారిక పార్టీ ఖాతాల ద్వారా యూట్యూబ్, ఫేస్‌బుక్ ఎక్స్ లలో ప్రత్యక్ష ప్రసారం చేశారని ఐహెచ్ఎల్ నివేదిక పేర్కొన్నది. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన రాజా సింగ్ ద్వేషపూరిత ప్రసంగాల్లో 74.5 శాతం ద్వేషపూరితమని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఆయన చేసిన 32 హేట్ స్పీచుల్లో 22 ప్రత్యక్షంగా హింసకు ప్రేరేపించేవిలా ఉన్నాయని పేర్కొంది. ప్రధానంగా ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని ఆ ప్రసంగాలు ఉన్నాయని తెలిపింది. వాటిలో 16 స్పీచ్‌లను యూట్యూబ్‌లో, 13 ప్రసంగాలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశారని వెల్లడించింది.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల నుంచి తన ఖాతాలను తొలగించడంపై రాజా సింగ్ ఎక్స్ వేదికగా స్పందించారు. హిందువులను లక్ష్యంగా చేసుకొని సెలెక్టివ్ సెన్సార్‌షిప్ దాడి చేస్తోంది. నా కుటుంబం, స్నేహితులు, కార్యకర్తలు, మద్దతుదారుల సోషల్ మీడియా ఖాతాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ బ్లాక్ చేయడం దురదృష్టకరం. రాహుల్‌గాంధీ చేసిన ఫిర్యాదు ఆధారంగా నా అధికారిక ఖాతాలకు అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అవినీతికి పెద్దపీట వేశారు.. సీఎం రేవంత్‌పై కిషన్‌రెడ్డి ఫైర్

ఆర్థిక పరిస్థితి దివాళా..

తెలంగాణ భవిష్యత్‌కు ఎమ్మెల్సీ ఎన్నికలు దిశానిర్దేశం చేసేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. రేవంత్ ఇచ్చిన ఏ ఒక్క హామీని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని.. మిగిలిన యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రేవంత్ ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని మండిపడ్డారు. ప్రతి దళిత కుటుంబానికి రూ 12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలపై రేవంత్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి..

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పోయి రేవంత్ వచ్చిన కూడా ప్రజల బతుకులు మారడం లేదని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్నచోట అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అవినీతికి పెద్దపీట వేశారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో మంచి పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో మంచి పాలన రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్

### అవినీతి కేసు వ్యవహారంలో కీలక పరిణామం

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని భూపాలపల్లి కోర్ట్ ఇచ్చిన ఆర్డర్‌ను కేసీఆర్, హరీష్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై శుక్రవారం న్యాయస్థానంలో విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని గతంలో భూపాలపల్లి కోర్ట్‌లో హత్యకు గురైన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి ప్రైవేటు పిటిషన్ చేశారు. ఈ కేసులో కేసీఆర్‌తో పాటు హరీష్ రావు, మెగా కృష్ణా రెడ్డి, మిగిలిన ప్రతివాదులకు భూపాలపల్లి జిల్లా కోర్ట్ నోటీసులు ఇచ్చింది. వ్యక్తిగతంగా విచారణకు రావాల్సిందిగా జూలై 10, 2024 నోటీసులు ఇచ్చింది భూపాలపల్లి కోర్టు.

కింది కోర్ట్ ఇచ్చిన ఆదేశాలను క్వాష్ చేయాలని కేసీఆర్ తరుపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారుడు రాజలింగమూర్తి చనిపోయాడు కాబట్టి కింది కోర్ట్ ఇచ్చిన ఆదేశాలు ఎత్తివేయాలని కేసీఆర్ తరుపు న్యాయవాది కోరారు. ఫిర్యాదుదారుడు హత్యకు గురైనట్లు న్యూస్‌లో చూశామని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారుడు చనిపోయిన తరువాత కేసు విచారణ అర్హత ఉండదు కదా అని న్యాయస్థానం పేర్కొంది. ఫిర్యాదుదారుడు చనిపోయినా కూడా కేసును కొనసాగించవచ్చని పీపీ వాదనలు వినిపించారు.

ఇందులో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, కొంత గడువు ఇస్తే సుప్రీంకోర్టు జెడ్జిమెంట్‌ను న్యాయస్థానం ముందు పెడతామని పీపీ తెలిపారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో ఇరువరి వాదనలు విన్న తరువాత కేసీఆర్, హరీష్‌రావు వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది అనేదానిపై సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది

## అందరికీ రుణమాఫీ.. అదో అందమైన కట్టుకథ :

### హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి



మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీనేనని, 420 హామీల అమలు వట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసుకున్నరు. మిమ్మల్ని నిలదీసేందుకు ఒక్కొక్కరిగా గాంధీ భవన్‌కు చేరకముందే పాపపరిహారం చేసుకోండి. రైతులు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు.. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు.

ఈరోజు గాంధీ భవన్ దాకా వచ్చిన వారు, రేపో మాపో మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాక వస్తరు. ప్యాలెస్ పాలన వదిలి ప్రజా పాలన కొనసాగించు. ఏడు పదుల వయస్సులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిండు, అధికారులను వేడుకున్నడు. అయినా వెనకడుగు వేయకుండా గాంధీ భవన్ దాకా వచ్చి పోరాటం చేస్తున్న రైతు యాదగిరి పట్టుదలకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, హామీలు అమలు చేసే దాకా కొట్లాడాలని బీఆర్ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా ఆర్డర్ ఇవ్వండి-

### హైకోర్టులో ప్రజా ప్రయోజన పిటిషన్

తెలంగాణలో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి, ఓడిపోయినప్పటి నుంచి ప్రజలకు కనిపించకుండా పోయిన కేసీఆర్.. కనీసం అసెంబ్లీకి కూడా రాకపోవడంపై అనేక విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయనను అసెంబ్లీకి వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రతీ ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ప్రజల సమస్యల్ని, వారి ప్రాంత బాగోగుల్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని, అలాంటి పని చేయనప్పుడు వారికి పదవులు ఎందుకని పిటిషనర్ ప్రశ్నించారు. కేసీఆర్ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారని, అది మరింత బాధ్యతలతో కూడుకున్నదని, అలాంటి బాధ్యతల్ని సరిగ్గా నిర్వర్తించకుండా ఉండడం సరైన చర్య కాదంటూ.. తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుక డి.విజయ్ పాల్ రెడ్డి పిటిషన్ దాఖాలు చేశారు. ప్రస్తుతం ఈ పటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

స్పీకర్ కార్యాలయం చర్యలు తీసుకోవాలి..

ప్రతిపక్ష నాయకుడిగా ఉండి అసెంబ్లీకి రాకుండా కాలక్షేపం చేస్తున్న కేసీఆర్ పై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్, స్పీకర్ కార్యాలయం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన విజయ్ పాల్.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే హైకోర్టును ఆశ్రయించినట్లుగా తెలిపారు. 2023 డిసెంబరు 16న ప్రతిపక్ష నేతగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఒక్కసారి కూడా ఆయన రాష్ట్ర అసెంబ్లీకి రాలేదు. అయినా ఇంతవరకు ప్రజాప్రతినిధుల విధులు, బాధ్యతల విషయంలో పాటు వారి సభ్యత్వాన్ని నిర్ధరించే శక్తివంతమైన అధికారులున్న స్పీకర్ కానీ, స్పీకర్ కార్యాలయం కానీ తగిన ప్రొసీడింగ్స్ చేపట్టలేదన్నారు. నెలకు రూ.లక్షల్లో వేతనాలు, అలెవెన్సులు తీసుకుంటూ కూడా ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తే ఎలాగని ప్రశ్నించారు.

కేసీఆర్ ను మార్చి వేరే వాళ్లను ఎన్నుకో కేటీఆర్

ప్రతిపక్ష నేతగా కేసీఆర్ విధులు నిర్వహించలేకపోతే ఆ బాధ్యతల నుంచి తప్పించి.. వారి స్థానంలో కొత్తవారిని ఎంచుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం.. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వహకాధ్యక్షుడిగా ఉన్న కేటీఆర్.. అసెంబ్లీలో తమ పార్టీ శాసనసభా పక్ష నేతగా మరొకరిని ఎన్నుకునేలా హైకోర్టు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఇదే విషయమైన స్పీకర్ కు, స్పీకర్ కార్యాలయానికి కోర్టు నోటీసులు పంపించామని.. అయినా ఎలాంటి స్పందనా లేకపోవడంతోనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చిందని పిటిషనర్ వివరించారు. న్యాయవ్యవస్థ ముందుకు తొలిసారి ఇలాంటి పిటిషన్ వచ్చిందని తెలిపిన పిటిషనర్.. శాసన వ్యవస్థ, అధికారులు తీసుకునే నిర్ణయాలను పూర్తిగా సమీక్షించే విస్తృతాధికారం కోర్టులకు ఉందని స్పష్టం చేశారు.

## గ్రేటర్ హైదరాబాద్.... గ్రేటర్ సికింద్రాబాద్?

### రెండుగా చీలిపోనున్న హైదరాబాద్..రెండు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం భావిస్తోంది. అప్పుడు జీహెచ్ఎంసీ 2 వేల చదరపు కిలోమీటర్ల వరకూ విస్తరిస్తుంది. దీంతో ఓఆర్ఆర్ వరకు హెచ్ఎండీఏ పరిధిని పెంచాలని సర్కార్ బావిస్తోంది. తద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , గ్రేటర్ సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గా హైదరాబాద్ ను విభజించాలని నిర్ణయించారు.

### ముంబయి తరహా విభజన

ముంబయి నగరం మొత్తం రెండు కార్పొరేషన్లుగా ఉండటం వల్లే అభివృద్ధి సాధ్యమైందన్న భావన ప్రభుత్వానికి ఉంది. హైదరాబాద్‌లోనూ ఆస్థాయి అభివృద్ధి జరగాలంటే రెండు కార్పొరేషన్లు ఉండాలని, దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీహెచ్ఎంసీని మినహాయిస్తే ఓఆర్ఆర్ లోపల 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్ కార్పొరేషన్‌తో పోలిస్తే అభివృద్ధి విషయంలో వీటి మధ్య వ్యత్యాసం ఉంది. ఈక్రమంలో ఓఆర్ఆర్ వరకూ నగరాన్ని ఒకేవిధంగా అభివృద్ధి చేసేందుకు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని

### 30 సర్కిళ్లు, ఆరు జోన్లుగా జీహెచ్ఎంసీ

రాజధానికి ఔటర్ రింగు రోడ్డు హద్దుగా చేసుకొని దాని లోపలున్న 2,100 చ.కి.మీ భూభాగాన్ని రెండు కార్పొరేషన్లుగా విభజిస్తారు. ప్రస్తుతం జీహెచ్ ఎంసీని 150 డివిజన్లుగా విభజించారు. GHMC,GSMC గా హైదరాబాద్ విభజన తర్వాత రాబోయే గ్రేటర్ నగరాల కోసం.. డివిజన్ల నుంచి పునర్విభజన ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. కాగా జీహెచ్ఎంసీ విభజనపై గత ప్రభుత్వానికి ప్రసాదరావు కమిటీ నివేదిక ఇచ్చింది. GHMC ని 50 సర్కిళ్లు, 10 జోన్లుగా విభజించాలని నివేదిక అందించింది.కానీ విభజన విషయంలో నాటి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేకపోయింది. ప్రస్తుతం 30 సర్కిళ్లు, ఆరు జోన్లుగా విభజించాలని ప్రభుత్వం భావిస్తోంది.

### మొదట విలీనం..తర్వాత విభజన

ఓఆర్ఆర్ లోపలి జీహెచ్ఎంసీతోపాటు 7 కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటితో పాటు కంటోన్మెంట్ బోర్డు, ఇతర సంస్థలు ఉన్నాయి. ఓఆర్ఆర్, వెలుపల ఉన్న మరో 10 పంచాయతీలనూ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని మున్సిపల్ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ముందుగా ఇప్పటికే గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగియడంతో వాటిని సమీపంలోని మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనం చేస్తారు. వచ్చే ఏడాది జనవరితో వీటి కాలపరిమితి ముగియనుండగా.. వాటిని జీహెచ్ఎంసీలో కలుపుతారు. విలీనానికి వీల్లేని గ్రామాలను ప్రత్యేక మున్సిపాలిటీలుగా గుర్తిస్తారు. చివరకు. జీహెచ్ఎంసీని రెండుగా విభజించి గ్రేటర్ కార్పొరేషన్లను ప్రభుత్వం ప్రకటిస్తుంది.

## పోతాయిగడ్డలో నూతన ప్రిన్స్ మెడికల్ షాప్

### ప్రారంభించిన పైళ్ల సోమిరెడ్డి



మోత్కూర్ 21ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రిన్స్ మెడికల్ షాప్ ను డిసిసి ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా పైళ్ళ సోమిరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసర ఔషధాలు సమయానికి అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని, ఈ మెడికల్ షాప్ ద్వారా స్థానికులకు మెరుగైన ఆరోగ్య సేవలు లభించనున్నాయన్నారు. మెడికల్ షాపులు కేవలం వ్యాపార కేంద్రాలుగా కాకుండా, ప్రజల ఆరోగ్యానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షాప్ నిర్వాహకులు కాశీం, పైళ్ల సోమిరెడ్డి,ని డాక్టర్ లక్ష్మి నరసింహ రెడ్డి,ని మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి సమీరుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు కారుపోతుల వెంకన్న, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్, జినకల కనకయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మెంట సురేష్ కు , మహ్మద్ అలీ మునిరుద్దీన్ గార్లకు ఘనంగా సన్మానించారు, కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, వ్యాపార వర్గాలు ఈ మెడికల్ షాప్ మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, భూషిపాక రమేష్, ఆలకుంట శ్రీను, అవిశెట్టి రాజాలు, సోమలింగా చారి,శ్రీను, మైనార్టీ నాయకులు ఎండి జానీ ,పట్టణ వాసులు పాల్గొన్నారు.

## గోదావరి జలాలుకు పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే సామేలు

మోత్కూర్21 ఫిబ్రవరి(క్రాంతిన్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ పరిధిలో సదర్శాపురం గ్రామంలో బిక్కేరు వాగులోకి యాసంగి పంటకు గోదావరి జలాలు వచ్చిన సందర్భంగా పూజ నిర్వహించి రైతులు యాసంగి పంటలు పండించి సుఖ సంతోషాలతో ఉండాలని పంటలను బాగా పండించాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామ శాఖ అధ్యక్షులు రైతులు తదితరులు పాల్గొన్నారు



## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ను గెలిపించాలి

### : సామేలు



మోత్కూర్ మండలంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందల సామేలు శుక్రవారం పాల్గొని ఆయన మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ నాయకులు రాబోయే స్థానిక ఎలక్షన్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్ర గౌడ్, మండల మహిళ అధ్యక్షురాలు పద్మ, మండల ప్రధాన కార్యదర్శి బాలరాజు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## తెలంగాణ మహిళలకు శుభవార్త..

### ఏడాదికి 2 ఖరీదైన చీరలు, రూ.1000 కోట్లతో.. రేవంత్ కీలక ప్రకటన..!



తెలంగాణలో కోటి మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లాలో పర్యటిస్తోన్న సీఎం రేవంత్ రెడ్డి.. అప్పకపల్లిలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. మహిళలకు శుభవార్త వినిపించారు. గత ప్రభుత్వం మహిళా సంఘాల్ని పట్టించుకోలేదని.. ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం మహిళా సంఘాల్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా.. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలని ఏడాదికి రెండు చీరలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గతంలో మామూలు చీరలు ఇచ్చేవారని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఖరీదైన చీరలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. మరోవైపు.. అంబానీ, అదానీలు పోటీపడే సోలార్ ప్రాజెక్టుల్లో మహిళలను ప్రోత్సహిస్తామని చెప్పుకొచ్చారు. మహిళలు వ్యాపారంలో వేగంగా ఎదిగేలా వారిని ప్రోత్సహిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

దేశంలోనే తొలిసారి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళలు ఆత్మగౌరవంతో బతుకుతారని తమ ప్రభుత్వం ప్రగాఢంగా నమ్ముతోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించామన్నారు.

తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యన్నారు. అన్ని రంగాల్లో మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని.. ఈ క్రమంలోనే.. 600 ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేశామని తెలిపారు. ఇదే క్రమంలో.. వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మహిళా స్వయం సహాయక ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి శిల్పారామం వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు.

త్వరలోనే మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏడాదికి రెండు ఖరీదైన చీరలు కానుకగా ఇవ్వనున్నామని రేవంత్ రెడ్డి కీలక ప్రకటించారు. సొంత ఆడబిడ్డలకు అందించినట్లు నాణ్యమైన చీరలను అందించనున్నామని తెలిపారు. రూరల్, అర్బన్ అనే తేడా లేదని... తెలంగాణలో మహిళలంతా ఒక్కటేనని.. అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుందామన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు ఎంపీ డీకే అరుణ సహకరించాలని కోరుతున్నట్టు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి మహిళల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. నిధులు తాము ఇస్తామని.. నిర్వహణ మీరు చేయండని కోరారు. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహించుకుంటామో.. బడులను కూడా అలాగే నిర్వహించుకోవాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌వాసులకు తీపికబురు.. ఆ షాపులు 24 గంటలు ఓపెన్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రంజాన్ మాసం సందర్భంగా షాపులు, వ్యాపార సముదాయాలు 24 గంటలూ తెరిచేందుకు అనుమతించింది. మార్చి 2వ తేదీ నుంచి 31 వరకు షాపులు, సముదాయాలూ ఓపెన్ చేసుకోవడానికి కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రంజాన్ మాసం సందర్భంగా షాపులు, వ్యాపార సముదాయాలు 24 గంటలూ తెరిచేందుకు అనుమతించింది. మార్చి 2వ తేదీ నుంచి 31 వరకు షాపులు, సముదాయాలూ ఓపెన్ చేసుకోవడానికి కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఉత్తర్వుల్లో కీలక అంశాన్ని ప్రస్తావించారు.. 'చట్టంలోని నిబంధనల ప్రకారం రోజుకి 8 గంటలు లేదా వారానికి 48 గంటలకు మించి పనిచేసినపుడు ఆ ఉద్యోగులు, కార్మికులకు సాధారణ వేతనం కన్నా రెండింతలు చెల్లించాలి' అని సూచించారు. జీవో నం.476కు లోబడి సెలవుల్లో పనిచేసిన కార్మికులకు ప్రత్యామ్నాయ సెలవు ఇవ్వాలని.. మహిళా ఉద్యోగులకు రాత్రివేళల్లో పనిచేసేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు.

మరోవైపు రంజాన్ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 3 నుంచి మార్చి 31 వరకూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులు, టీచర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, బోర్డ్స్, కార్పొరేషన్స్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే ఆఫీస్?ల నుంచి, స్కూళ్ల నుంచి వెళ్లిపోవచ్చని తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం సర్క్యులర్?లో వివరాలను వెల్లడించింది. ముస్లిం ఉద్యోగులకు వీలుగా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

మరోవైపు రంజాన్ మాసంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. మంత్రి హైదరాబాద్ సిటీ ఎమ్మెల్యేలు, అధికారులతో మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో సమీక్ష చేశారు. ఈద్గాలు, మసీదుల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాదు రంజాన్ నెలలో ముస్లింలకు సమయానికి రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారుల్ని ఆదేశించారు. అలాగే రంజాన్ సమయంలో షాపింగ్ కోసం అర్ధరాత్రి వరకు వీధి వ్యాపారాలు కొనసాగించడానికి అనుమతించాలని పోలీస్ అధికారులను, సిటీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రిక్వెస్ట్ చేశారు.. ట్రాఫిక్ మళ్లింపులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

## సీఎం రేవంత్‌ను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదు

### హైకోర్టులో కేటీఆర్ పిటిషన్

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని కోరారు. సీఎం రేవంత్ ను అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదుతో బంజారాహిల్స్‌లో కేసు నమోదైంది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద సీఎం రూ.2500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని.. తన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదన్నారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మార్చి 18కి వాయిదా వేసింది.

## హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై కేసులు

### : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



రేవంత్ రెడ్డి హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీశ్‌రావుపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ నేతలు ప్రజలపై మత్తు మందు చల్లారు. ఏడో గ్యారంటీగా ప్రజా పాలన అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రతీకార పాలన అమలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుపై రేవంత్ రెడ్డి కక్ష గట్టి ఓ నేరస్తుడు చక్రధర్‌తో పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారు. అధికారులను పావులుగా వాడుకుని హరీశ్‌రావును ఎంతగా వేధించినా ప్రజల పక్షానే ఉంటారు. హరీశ్‌రావు ఏడు సార్లు సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొవిడ్ సమయంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించారు. రేవంత్ రెడ్డిలాగా హరీశ్‌రావు ఓటుకు నోటు కేసులో పాలుపంచుకోలేదు. ఏదైనా చేసి దేంట్లోనైనా హరీశ్‌రావును ఇరికించాలని రేవంత్ రెడ్డి విశ్వ ప్రయత్నం చేశారు. రేవంత్ రెడ్డిని హామీలపై ప్రశ్నిస్తున్నందుకే హరీష్ రావుపై కక్ష గట్టారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఎగవేతల రేవంత్ రెడ్డి అన్నందుకు మానకొండూరు పీఎస్‌లో కేసు పెట్టారు. యాదాద్రిలో రేవంత్ రుణ మాఫీ ఒట్టు పెట్టి మాట నిలుపుకోనందుకు హరీష్ రావు ప్రశ్నిస్తే అక్కడ కూడా కేసు పెట్టారు. ఇలా చిన్న చిన్న అంశాల్లో హరీశ్‌రావుపై కేసులు పెడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు రేవంత్ అడుగులకు మడుగులొత్తుతున్నారు. పంజాగుట్ట కేసులో హరీశ్‌రావు దగ్గర కేవలం మూడు నెలలు పనిచేసిన వంశీని డీసీపీ చేసిన టార్చర్ అంతా ఇంతా కాదు. హరీశ్ రావు పేరు చెప్పాలని లేదంటే చంపేస్తామని డీసీపీ విజయ్ కుమార్ బెదిరించారు. నేను కూడా ఐపీఎస్ అధికారిగా పని చేశాను. సీఎంలు ఒత్తిడి చేసినంత మాత్రాన ఐపీఎస్ అధికారి పక్షపాతంతో వ్యవహరిస్తారా..? ఒత్తిడికి తలొగ్గలేమని చెప్పి విజయ్ కుమార్ లాంటి వాళ్ళు ఉద్యోగాలను వదిలివేయడం మంచిది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

చక్రధర్‌పై రకరకాల కేసులు ఉన్నాయి. లైంగిక దాడి వంటి తీవ్ర నేరారోపణలు చక్రధర్‌పై ఉన్నాయి. 1900 మందిని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసు చక్రధర్‌పై ఉంది. కిడ్నాప్ కేసు కూడా చక్రధర్‌పై ఉంది. చక్రధర్ రేవంత్ ప్రోద్బలంతోనే హరీశ్‌రావుపై పంజాగుట్టలో కేసు పెట్టారు. మొదట హైకోర్టులో రిట్ వేసి చక్రధర్ విత్ డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత పంజాగుట్టలో ఫిర్యాదు చేయగానే కొన్ని గంటల్లోనే హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి హరీశ్‌రావు, ఆయన అనుచరగణంపై పోలీసులు కక్ష గట్టి వ్యవహరిస్తున్నారు అని ఆర్ఎస్పీ తెలిపారు.

## పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా.?.

### కేసీఆర్, కిషన్ రెడ్డిలకు రేవంత్ సవాల్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ..11 ఏళ్లు మోదీ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు తాను చర్చకు సిద్ధమని.. కేసీఆర్, కిషన్ రెడ్డి చర్చకు రావాలన్నారు. చర్చలో తాను ఓడితే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు రేవంత్.

ప్రజాపాలన బాగలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యగాలిచ్చాం..21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని చెప్పారు. పరిశ్రమలు ,ప్రాజెక్టులు రాకుండా బీఆర్ఎస్,బీజేపీ అడ్డుకుంటుందని మండిపడ్డారు రేవంత్.తాను అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్, నారాయణపేట్ ,కొడంగల్ ప్రాజెక్టులను మొదలు పెట్టానన్నారు రేవంత్. కేసీఆర్ గట్టిగా కొడతానంటున్నావ్.. గట్టిగా కొట్టడానికి అది ఫుల్లా.. ఆఫా.. కొట్టాలనుకుంటే ముందుగా మీ బిడ్డను ,కొడుకును, అల్లుడిని కొట్టు..మమ్మల్ని కొడితే మా కార్యకర్తలు ఊరుకుంటారా? ఇచ్చిన హామీలను ఐదేళ్లలో పూర్తి చేసే బాధ్యత నాదే అని రేవంత్ అన్నారు.

# టీటీడీ ఉద్యోగికి బోర్డు సభ్యుడి క్షమాపణలు..

### వివాదానికి ఎండ్ కార్డ్..

### అసలేమైందంటే?



తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు, టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్ కుమార్ మధ్యన నెలకొన్న వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్ కుమార్ వ్యవహార శైలిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. టీటీడీ ఉద్యోగిని బోర్డు సభ్యుడుగా ఉన్న నరేష్ కుమార్ దూషించడంతో, అది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మూడు రోజుల క్రితం ఈ ఘటన జరగ్గా.. టీటీడీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. వరుసగా రెండో రోజు మౌనదీక్ష కొనసాగించారు. టీటీడీ పరిపాలనా భవనం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ టీటీడీ మౌనదీక్షకు చేశారు. టీటీడీ ఉద్యోగి పట్ల దురుసుగా ప్రవర్తించిన బోర్డు సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్? చేశారు. నరేష్ కుమార్ మీద రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

టీటీడీ ఉద్యోగుల ఆందోళనల నేపథ్యంలో టీటీడీ ఈవో శ్యామలరావు రంగంలోకి దిగారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఈవో శ్యామలరావు, బోర్డు సభ్యుడు నరేష్ కుమార్, భాను ప్రకాశ్‌రెడ్డి సమావేశమయ్యారు. మరోవైపు టీటీడీ ఉద్యోగులు కూడా సమావేశమై పరస్పరం చర్చించుకున్నారు. అనంతరం టీటీడీ ఉద్యోగి బాలాజీ సింగ్‌ను బోర్డు సభ్యుడు నరేష్? కుమార్? వ్యక్తిగతంగా కలిసి క్షమాపణలు తెలియజేశారు. దీంతో ఈ వివాదానికి తెరపడింది. జరిగిన ఘటన దురదృష్టకరమన్న టీటీడీ బోర్డు సభ్యులు.. ఉద్యోగులతో చర్చించి సమస్యను పరిష్కరించుకున్నట్లు తెలిపారు. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని టీటీడీ ఈవో శ్యామలరావు హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. బోర్డు సభ్యుడు నరేష్ కుమార్ ఉద్యోగికి క్షమాపణ చెప్పడంతో ఆందోళనలను విరమిస్తున్నట్లు ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు.

### అసలేం జరిగిందంటే?

ఫిబ్రవరి 18వ తేదీ ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం సమయంలో టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్ కుమార్ శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం తమవారితో కలిసి మహాద్వారం వద్దకు నరేష్ కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా మహాద్వారం గేటు తీయాలని అక్కడ విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి బాలాజీసింగ్‌ను నరేష్ కుమార్ సహాయకుడు కోరాడు. అయితే మహాద్వారం గేటు ద్వారా ఎవరినీ అనుమతించడం లేదని బాలాజీసింగ్ గేటు తీసేందుకు నిరాకరించారు. ఈ విషయంలో అభ్యంతరం ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని నరేష్ కుమార్ సహాయకుడికి బదులిచ్చారు.

దీంతో టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కోపంతో.. టీటీడీ ఉద్యోగి బాలాజీ సింగ్‌ను అసభ్యంగా దూషించారు. దురుసుగా ప్రవర్తించారు. అయితే ఈలోపు అక్కడకు చేరుకున్న టీటీడీ వీజీఓ, ఇతర అధికారులు నరేష్ కుమార్‌కు సర్దిచెప్పి. ఆ తర్వాత మహాద్వారం గేటు ద్వారానే వెలుపలికి పంపించారు. టీటీడీ సిబ్బందితో నరేష్ కుమార్ వ్యవహరించిన తీరు వైరల్ కాగా.. టీటీడీ ఉద్యోగి బాలాజీ సింగ్‌కు క్షమాపణలు చెప్పాలంటూ టీటీడీ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. అయితే ఈవో జోక్యంతో వివాదానికి తెరపడింది.

# ఏపీలో అక్కడ ఫ్రీగా చికెన్..

### తిన్నోళ్లకు తిన్నంత.. ఎగబడిన జనం..



తెలుగు రాష్ట్రాలను బర్డ్ ఫ్లూ భయాలు వెంటాడుతున్నాయి. చికెన్ తింటే బర్డ్ ఫ్లూ వస్తుందనే భయంతో చాలా మంది చికెన్, కోడి గుడ్లకు దూరంగా ఉంటున్నారు. మాంసం, కోడి గుడ్లు బాగా ఉడికిస్తే ప్రమాదం ఉండదని అధికారులు చెప్తున్నప్పటికీ.. జనాల్లో ఆందోళన తగ్గడం లేదు. దీంతో చికెన్ రేట్లు పడిపోయాయి. కోడి గుడ్డు ధర సైతం భారీగా పతనమైంది. చికెన్, కోడిగుడ్ల రేట్లు పడిపోవటంతో కోళ్లఫారం యజమానులు, పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఫౌల్ట్రీ ఫెడరేషన్ నివారణ చర్యలకు దిగింది. ఫౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బర్డ్ ఫ్లూపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగానే గుంటూరులో చికెన్ ఫుడ్ మేళా శుక్రవారం నిర్వహించారు.

ఫౌల్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన చికెన్ ఫుడ్ మేళాకు విశేషమైన స్పందన వచ్చింది. చికెన్ ఫుడ్ మేళాలో నిర్వాహకులు చికెన్ వంటకాలను ఉచితంగా అందజేశారు. ఉడికించిన చికెన్, కోడి గుడ్లు తినడం వల్ల ఇబ్బంది ఉండదని వచ్చిన జనాలకు నిర్వాకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నసీర్ అహ్మద్ సైతం పాల్గొన్నారు. మరోవైపు ఉచితంగా చికెన్ వంటకాలు పంపిణీ చేస్తూ ఉండటంతో ఆహార ప్రియులు చికెన్ ఫుడ్ మేళాకు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాంగణం మొత్తం నిండిపోయింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నిర్వాహకులు గేట్లకు తాళం వేయాల్సి వచ్చింది. అటు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కూడా ఇలాగే ఫ్రీగా చికెన్ పంపిణీ చేశారు. ఉచితంగా చికెన్, కోడిగుడ్ల వంటకాలు పంపిణీ చేశారు. దీంతో ఈ చికెన్ మేళాకు భారీగా జనం క్యూ కట్టారు. సుమారుగా అర కిలోమీటర్ మేర బారులు తీరారు.

### ఏపీలో అదుపులోనే బర్డ్ ఫ్లూ

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి అదుపులో ఉందని ఏపీ పశు సంవర్ధక శాఖ తెలిపింది. బర్డ్ ఫ్లూ వైరస్ గురించి పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ ఇటీవల ప్రకటన విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారం, పశ్చిమ గోదావరి జిల్లాలోని వేల్పూరు, కృష్ణా జిల్లాలోని బాదంపూడి, కర్నూలు జిల్లాలోని ఎన్.ఆర్.పేట, ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెంలో బర్డ్ ఫ్లూ వైరస్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాలలో పశు సంవర్ధక శాఖ అధికారులు ఆంక్షలు అమలు చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా కోళ్లు చనిపోయిన ప్రాంతాలను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించి.. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వైరస్ విస్తరించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రాంతం నుంచి కోళ్లు, కోడిగుడ్ల రవాణాపై ఆంక్షలు విధించారు.

# చేనేత కార్మికులకు శుభవార్త..

### తమిళనాడుతో ఏపీ ఒప్పందం..

### ఇకపై అక్కడ కూడా!



చేనేత వస్త్రాల అమ్మకాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమిళనాడుతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆప్కో, తమిళనాడు సర్కారుకు చెందిన కోఆప్టెక్స్ సంస్థల మధ్య చేనేత వస్త్రాల విక్రయంపై ఒప్పందం కుదిరింది. విజయవాడలోని బయ్యర్, సెల్లార్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు చేనేత, జౌళి శాఖల మంత్రులు సవిత, ఆర్.గాంధీ సమక్షంలో రెండు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఏడాది కాలంలో రూ.9.20 కోట్ల మేర వస్త్రాలు విక్రయించాలని రెండు సంస్థలు నిర్ణయించాయి. రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ కల్పించేందుకు గానూ.. తమిళనాడు కో ఆప్టెక్స్‌తో ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా తమిళనాడు చేనేత వస్త్రాలను ఆప్కో షోరూములు సహా ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర వ్యాపార సంస్థల్లో అమ్మకాలు జరుపుతారు. అలాగే మన రాష్ట్రానికి చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్‌లతో పాటు తమిళనాడులోని పలు వస్త్ర దుకాణాల్లో విక్రయిస్తారని అధికారులు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చేనేత వస్త్రాలను మార్కెట్ కల్పించాలనే ఉద్దేశంతో తమిళనాడుతో ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ తరహాలోనే త్వరలో మిగతా రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలతోనూ ఒప్పందం కుదుర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా మన చేనేత వస్త్రాలకు విస్తృతమైన మార్కెటింగ్ అవకాశాలు దక్కుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రాష్ట్రంలోని చేనేత కార్మికులకు 365 రోజులూ పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సవిత తెలిపారు. ఏడాది పొడవునా వారికి పని కల్పించి ఆర్థికంగా, సామాజికంగా వారు నిలదొక్కుకునేలా చేయటమే తమ కూటమి సర్కార్ ముందున్న లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగానే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ విస్తరించే పనిలో ఉన్నట్లు మంత్రి సవిత వివరించారు.

మరోవైపు చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించేందుకు ఆప్కో ఆధ్వర్యంలో ఏపీతోపాటుగా జాతీయ స్థాయిలో చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నారు. అలాగే నేటి తరం అభిరుచులను ప్రతిబింబించేలా డిజైన్లు, దుస్తులు తయారు చేసేందుకునేత కార్మికులను శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇతర రాష్ట్రాల చేనేత సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని ఇతర రాష్ట్రాలలోనూ ఏపీ నేత కార్మికుల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే తమిళనాడుకు చెందిన కోఆప్టెక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.



# ఏపీలోని మహిళలకు ఉమెన్స్ డే గిఫ్ట్..!

### సిద్ధం చేస్తున్న ప్రభుత్వం..



రాష్ట్రంలోని మహిళల భద్రత, రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళల రక్షణ కోసం సురక్ష పేరుతో ప్రత్యేక యాప్ తీసుకువచ్చే ఆలోచన చేస్తోంది. ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పోలీస్ ఉన్నతాధికారులతో హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ విషయంలో పోలీసులు కఠిన వైఖరి అవలంబించాలని హోం మంత్రి ఆదేశించారు. మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి కలిగి ఉందన్న వంగలపూడి అనిత.. విద్య, సాధికారత, భద్రత విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. మహిళల రక్షణ కోసం హెల్ప్ డెస్కుల ఏర్పాటు, సిబ్బంది కేటాయింపు వంటి అంశాలపై హోం మంత్రి చర్చించారు. ఈ సందర్భంగానే 'సురక్ష' పేరుతో ప్రత్యేక యాప్ రూపకల్పనపై హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులకు కీలక సూచనలు ఇచ్చారు. మహిళా దినోత్సవమైన మార్చి 8 నాటికి సురక్ష యాప్ రూపకల్పన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహిళల రక్షణ కోసం స్పెషల్ వింగ్ ఏర్పాటు చేయాలని.. అందుకు అవసరమైన సిబ్బందిని కేటాయించడం సహా వారికి ట్రైనింగ్ ఇవ్వాలని హోం మంత్రి ఆదేశించారు. పోక్సో కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని.. ఇందుకోసం ఛార్జ్ షీట్లు పకడ్బందీగా తయారు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి జిల్లాలో సురక్ష టీములు పెంచి 24 గంటలు నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. 112, 181, 1098 వంటి హెల్ప్ లైన్లపై ప్రజల్లో అవగాహన పెంచాలని., ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గర కావాలని సూచించారు.

రాష్ట్రంలో నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో టెక్నాలజీని ఉపయోగించుకోవాలని, డ్రోన్ల వినియోగం పెంచాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలను అసభ్య పదజాలంతో దూషించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోషల్ మీడియా వాడకంపై యువతలో అవగాహన పెంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 24 గంటలూ డీఎస్పీ స్థాయి అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని హోం మంత్రి స్పష్టం చేశారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపిన వంగలపూడి అనిత.. మార్చి 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.



# పవన్ కళ్యాణ్ ఫోటోల మార్ఫింగ్..

### పలుచోట్ల కేసులు నమోదు..



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోల మార్ఫింగ్ అంశానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలుచోట్ల కేసులు నమోదవుతున్నాయి. జనసేన పార్టీ కార్యకర్తలు, నేతల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేసి అభ్యంతరకర పోస్టులు పెడుతున్నారంటూ జనసేన శ్రేణులు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటి వరకూ తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, బాపట్ల, విజయవాడ, నరసరావుపేటలో పవన్ కళ్యాణ్ ఫోటోల మార్ఫింగ్ విషయంలో కేసులు నమోదైనట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఫోటోలు మార్ఫింగ్ చేశారంటూ ఫిర్యాదు చేసిన జనసేన కార్యకర్తలు .. మార్ఫింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసిన పోలీసులు.. పవన్ కళ్యాణ్ మార్ఫింగ్ ఫోటోలను పోస్ట్ చేసిన వారిని గుర్తించే పనిలో పడ్డారు.

మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా, తనయుడు అకీరా నందన్, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కలిసి ఇటీవల కుంభమేళాకు వెళ్లారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో పాల్గొని పవిత్ర స్నానాలు ఆచరించారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. అయితే కొంతమంది పవన్ కళ్యాణ్ ఫోటోలను మార్ఫింగ్ చేసి బాడీ షేమింగ్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో జనసేన శ్రేణులు మార్ఫింగ్ ఫోటోలను పోస్ట్ చేస్తున్న వారిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. ఏయే అకౌంట్ల నుంచి వీటిని పోస్ట్ చేశారు, వాటి వెనుక ఎవరున్నారనే దానిని తేల్చే పనిలో పడ్డారు.

మరోవైపు పవన్ కళ్యాణ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా పర్యటన సందర్భంగా జంధ్యం ధరించడంపైనా తీవ్ర చర్చ జరిగింది. ఇప్పుడేమో ఆయన పుణ్యస్నానాలు ఆచరించిన ఫోటోలను మార్ఫింగ్ చేసి, వైరల్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ఫోటోల మార్ఫింగ్ వెనుక ఉన్న వారిని కఠినంగా శిక్షించాలని జనసేన శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. అటు పోలీసులు సైతం ఈ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, కామెంట్లపై ఏపీ పోలీసులు ఇటీవల స్పెషల్ ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే.

# సేవే పరమావధిగా మీ ముందుకు వస్తున్న ఆలోచించండి ఆశీర్వదించండి

## ట్రస్మా బలపరిచిన స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు

విద్యను వ్యాపారం చేయలేదని సర్వీస్ చేస్తున్నానని మార్పు కోసం వస్తున్న ఆశీర్వదించండి పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. శుక్రవారం రోజు సిద్దిపేట ప్రెస్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు దేశంలో పలు రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ ప్రతినిధులు తన గెలుపు కోసం వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు బిజినెస్ చేసేవారు తన లాభం కోసం చూస్తారు గాని నిస్వార్థంగా సేవ చేయలేరన్నారు పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను కాదని వేలకోట్ల సంపాదించే కార్పొరేట్ వ్యక్తులకు పార్టీ టికెట్లు ఇచ్చి పార్టీలో కార్యకర్తలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు నేడు 40 మంది ఉన్న శాసనమండలిలో ఎలాంటి చర్చ జరుగుతా లేదన్నారు తనను గెలిపిస్తే 6 సంవత్సరాలలో ప్రతి నెల జీతం ఒక్కొక్క మండలానికి ఇచ్చి రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా కోచింగ్ ఇచ్చి పట్టభద్రుల అభివృద్ధికి దోహదపడతానని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు వేల కోట్ల రూపాయలతో ఎన్నికలకు వస్తున్నారని పట్టబద్రులు ఆలోచించాలన్నారు పట్టభద్రులను ఓటు అడిగే నైతిక విలువ లేని వారు కూడా ఈరోజు ఓట్లు అంటూ వస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కయని అన్నారు 272 మండలాలు తిరిగిన వ్యక్తి తానని ప్రతి వారి సమస్యను తెలుసుకున్నానని ముఖ్యంగా జూనియర్ లాయర్లకు స్టైఫండ్ ఇచ్చేలా కృషి చేస్తానని ప్రైవేట్ టీచర్లకు ఐదు లక్షల ఆరోగ్య భీమా ఐదు లక్షల ఇన్సూరెన్స్ వచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి రియంబర్స్మెంట్ తీసుకొచ్చి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు



బాటలు వేశారని ఇప్పుడు రియంబర్స్మెంట్ రాక చాలామంది విద్యార్థులు చదువును కొనసాగించ లేకపోతున్నారని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్ లకు సంబంధించిన నిధులు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా త్వరగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు ముఖ్యంగా పత్రిక సోదరులకు ఇస్తానన్న హామీలు కూడా తుంగలో తొక్కారని తనను అధిక మెజారిటీతో గెలిపిస్తే పత్రిక విలేకరులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కావచ్చు వాళ్ళ పిల్లల చదువుల్లో రాయితీలను కావచ్చు వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. ఉన్న డబ్బును కాపాడడానికి ఆస్తులు పెంచుకోవడానికి ఎమ్మెల్సీగా పోటీ చేయడం లేదని సేవ చేయడానికి మీ ముందుకు వచ్చానని ఆశీర్వదించండి అని అన్నారు ఈ ఎలక్షన్లు ముఖ్యంగా కామన్ మ్యాన్ కు కార్పొరేట్ మ్యానుకు మధ్య జరుగుతుందని అన్నారు. పార్టీలను చూసి గాని కులాలను చూసి గాని ఓట్లు వేయకండి సేవా గుణం ఉన్న వ్యక్తిని నేనని అన్నారు.

కొంతమంది వ్యక్తుల వల్ల రాజకీయాలంటేనే డబ్బు అనే అభిప్రాయం ప్రజల్లో నాటుకుపోయిందని దీన్ని మార్చడానికి తాను ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వందలాది ట్రస్మా సంఘంలోని పాఠశాలలన్నీ తనకు మద్దతు ప్రకటిస్తున్నాయని అన్నారు గత కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు 25 కిలోల బియ్యం రెండు వేల రూపాయల నగదు ప్రభుత్వం నుండి తాను ఇప్పించిన విషయం ప్రైవేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు మరిచిపోలేదని ఎక్కడికి వెళ్లినా తనకు గుర్తు చేస్తున్నారని చేసిన మేలు గుర్తుంచుకుంటామని చెబుతున్నారని అన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలకు ఆరోగ్యకరమైన కోటికి చిరునామాగా నేనున్నానని పట్టభద్రుడు నమ్మకంతో గెలిపించాలని కోరారు. సిద్దిపేటలోని వివిధ పాఠశాలలోని పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ట్రస్మా అధ్యక్షులు నాగిని నరసింహారెడ్డి, ట్రెజరరీ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుభాష్, శైలేందర్ జిల్లా ఉపాధ్యక్షులు,కే నారాయణరెడ్డి రాష్ట్ర సలహాదారు మరియు ట్రస్మా భాద్యులు పాల్గొన్నారు.

# అన్న ఎన్టీఆర్ గారి కుమార్తెను కలసీన అన్న ఎన్టీఆర్ అభిమానులు

## కళ్యాడపు ఆగయ్య, సందబోయిన రాజేశం, గూడ లక్ష్మణ్.

శుక్రవారం రోజున బిజెపి అధ్యక్షురాలు పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి గారిని ఈరోజు ఉదయం 11.30.గం. కరీంనగర్ లో వారికి విశ్రాంతి కొరకు ఏర్పాటు చేసిన హెూటల్ వద్ద జిల్లా ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు కళ్యాడపు ఆగయ్య గారి ఆధ్వర్యంలో కళ్యాడపు ఆగయ్య,తో పాటు ఎన్టీఆర్ అబిమానులు సంద బోయిన రాజేశం, గూడ లక్ష్మణ్ గార్లు కలసి మాట్లాడడం జరిగినది.

పురంధేశ్వరి గారు కారు దిగిరాగానే మేము మేడం నమస్కారం నాపేరు కళ్యాడపు ఆగయ్య మాది అన్న ఎన్టీఆర్ అభిమాన సంఘ 1969.నుండి నేను అన్న ఎన్టీఆర్ వీరాభిమానిని వీరి పేరు సందబోయిన రాజేశం, వీరు గూడ లక్ష్మణ్ అంటు పరిచయం చేయడం జరిగినది. అన్న గారు పార్టీ స్థాపించిన నాటినుండి నేటివరకు తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్నాం మీ ప్రెస్ మీటు అయిన తర్వాత మాకు అయిదు నిముషాలు మాట్లాడటానికి సమయంకాలని కళ్యాడపు ఆ గయ్య పురంధేశ్వరి గారిని కోరడం జరిగినది అందుకు వారు సరే అంటు లోనకు వెళుతు ఆగి మాట్లాడథం రండి అంటు పదే పదే అన్నారు అందుకు సరే అంటు ఆగయ్య ఏమన్నాడు అంటే మీరు కొంత ఫ్రి అయిన తరువాత మాట్లాడుదాం మేడం అన్నాను వారు పర్వాలేదు చెప్పండి అన్నారు మేడం వీరి పేరు సంద బోయిన రాజేశం, వీరి పేరు గూడ లక్ష్మణ్ అంటు పరిచయం చేసి వారికి బోకెన్ అందించడం జరిగినది. అనంతరం కళ్యాడ పు ఆగయ్య మాట్లాడుతు మేడం ఎన్.టీ.రామారావు గారికి భారత రత్న రావడంలో చాల జాప్యం జరుగుతున్నది ఈది కేంద్ర



ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం ఈది సరియైనది కాదు ఎన్టీఆర్ గారు సినీరంగంలో ఉన్న ప్పుడే భారత రత్న రావలి ఇవ్వాళ్ళ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉండొచ్చు దీనికి ముందు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండవచ్చు వారు కూడ, ఇప్పటి వరకు కూడ ఎన్టీఆర్ చరిత్రను ఎన్టీఆర్ గారిని గుర్తించకపోవడం బాధాకరం అన్నాడు. ఎన్టీఆర్ వజ్రోత్సవ కార్యక్రమం విజయ వాడలో గత డిసెంబర్లో జరిగింది మేము పాల్గొన్నాం పాల్గొన్న ముఖ్యులంత అక్కడ ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని కొరినారు. మీరుకూడ ప్రయత్నించండి మేడం అన్నాను వారు అందుకు ఒక మాట చెప్పడం జరిగింది ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలని అసెంబ్లీ లో తీర్మానం చేసీనార అని అన్నారు అందుకు నేను చేయలేదు మేడం అన్నాను అందుకు వారు అసెంబ్లీలో తీర్మానం చేయించండి అన్నారు మంచిది మేడం మీరు కూడ ప్రయత్నించండి మేడం అన్నాను అందుకు వారు కూడ సరిన్నారు మంచిది మేడం నమస్కారం అంటు సెలవు తీసుకున్నాం. ఈది మేడం పురంధేశ్వరి గారితో జరిగిన సంభాషణ. ఇట్లు ఎన్టీఆర్ వీరాభిమాని కళ్యాడపు ఆగయ్య జిల్లా ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు కరీంనగర్.

# కో-ఆర్డినేటర్లు సమిష్టిగా పని చేసి పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలి

## పరకాల శాసనసభ్యులు, హుజురాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి

•ఏడాదిలో 55,000 వేల పైచిలుకు ఉద్యోగాలు నిరుద్యోగులకు అందజేశం •భవిష్యత్ అంతా కాంగ్రెస్ దే పట్టభద్రుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం •జమ్మికుంట పట్టణ,వీణవంక మండల కో-ఆర్డినేటర్ ల రివ్యూ సమీక్షసమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఏ





పరకాల,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పదేళ్లు అధికారంలో ఉన్న BRS & BJP పార్టీలు నిరుద్యోగుల విషయంలో అన్యాయం చేశారని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు అన్నారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగిన కో-ఆర్డినేటర్స్ సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమీక్ష సమావేశానికి జమ్మికుంట పట్టణ,వీణవంక మండల కో-ఆర్డినేటర్స్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి,పార్టీ నిలబెట్టిన అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకొని ఒక్క ఓటు కూడా తప్పకుండా ఓటు వేసేవరికి బాధ్యత తీసుకోవాలని కోరారు. పట్టభద్రుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని త్వరలోనే వారి సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వం చొరవ చూపిస్తుందని అన్నారు. గడచిన ఏడాదిలో దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వనటువంటి ఉద్యోగాలు తెలంగాణ ప్రభుత్వం 55,000 వేల ఉద్యోగాలు ఇచ్చిందని,నియామకాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు సిపిఎం వినతి

పరకాల,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పరకాలబీ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ గృహ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది అనంతరం కళ్యాణ్ మాట్లాడుతూ పరకాల పట్టణంలో మున్సిపల్ పరిధిలో 4,9,15,18,19,



వార్డుల పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్నాయి వ్యాపార సముదాయాలు సైతం అనుమతి మేరకు కాకుండా ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తున్నారు పరకాల టౌన్ ప్లానింగ్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అనేక నిర్మాణాలు అనుమతులు లేకుండానే పట్టణ పరిధిలో కొనసాగుతున్నాయి నూతన భవన నిర్మాణాల పట్ల తక్షణమే విచారణ జరిపించి భవిష్యత్ కాలంలో ఇబ్బందులకు దారి కాకుండా వెంటనే విచారణ జరిపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కళ్యాణ్ అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హేమంత్ ఈశ్వర్ పాల్గొన్నారు.

# ఉద్యాన విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే



వనపర్తి ప్రతి నిధి 21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పెద్దమందడి మండలం మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులతో శుక్రవారం వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు మాట్లాడారూ. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో మాట్లాడి ఉద్యాన కళాశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాల్సిందిగా ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో డి సి సి బి జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య, అధ్యాపకులు, జడల శంకర స్వామి, జే. శ్రీనివాసులు, షహనాజ్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

## విద్యార్థులకు బహుమతులు అందజేసిన వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య..



హనుమకొండ 21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):విద్యార్థులను అభినందించిన ఎంపీ కడియం కావ్య. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఫిబ్రవరి 21 సందర్భంగా హనుమకొండ లోని నక్కలగుట్ట లో గల శ్రీ చైతన్య పాఠశాల హనుమకొండ- 4 బ్రాంచి విద్యార్థులకు తెలుగు విభాగం ఆధ్వర్యంలో పద్య రచన పోటీలు మరియు తెలుగు భాష యొక్క గొప్పతనం గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు...ప్రతిభ కనపరిచిన విద్యార్థిని విద్యార్థులకు వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య విద్యార్థులకు బహుమతులు (సర్టిఫికెట్స్, మెడల్స్, షీల్డ్) అందజేశారు... ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కడియం కావ్యగారు మాట్లాడుతూ... తెలుగు భాష మన మాతృభాష. మనం మన మాతృభాషలో ప్రావీణ్యత సంపాదిస్తేనే పరభాషలో కూడా సులభంగా ప్రావీణ్యత పొందవచ్చని అన్నారు... నేటి కాలంలో మన మాతృభాష అయిన తెలుగును ఒక చిన్న చూపుగా చూస్తున్నారు... కానీ మన మాతృభాష అయిన తెలుగును గౌరవించుకోవాలని తెలుగులో ఉన్న ప్రముఖ గ్రంథాలను మరియు మన ఇతిహాసాలను చదవాలని అప్పుడే తెలుగు యొక్క మాధుర్యం తెలుస్తుందని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు... మన జీవితంలో ఎన్ని భాషలు నేర్చుకున్న కూడా మన తల్లి నుండి నేర్చుకున్న మాతృభాష ను మరువకూడదని ఈ సందర్భంగా తెలియజేశారు... బహుమతులు గెల్చుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు... ఈ




కార్యక్రమంలో స్కూల్ జోనల్ కోఆర్డినేటర్ జి.శివ కోటేశ్వరరావు, ఏ.జీ.ఎం. రాజేశ్వర్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ నలిని శ్రీ, పాఠశాల ఇన్చార్జి డి.నాగేశ్వరరావు తెలుగు ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాసాచారి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు...



# వీళ్లకు కిడ్నీలో రాళ్లు వచ్చే రిస్క్ ఎక్కువగా ఉంటుంది..!

హెల్త్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మన శరీరంలో ఉన్న ముఖ్యమైన అవయవాల్లో కిడ్నీలు ఒకటి. మన శరీరమంతా ప్రవహించే రక్తాన్ని ఈ కిడ్నీలేశుద్ధి చేస్తాయి. ఎప్పటికప్పుడు రక్తంలో చేరే మలినాలను తొలగించి యూరిన్ రూపంలో బయటకు పంపుతాయి. కిడ్నీలు మన బాడీలోని యాసిడ్స్, బేస్‌లను స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతేకాదు, కిడ్నీలు రక్తపోటును కంట్రోల్‌లో ఉంచుతాయి. ఎర్రరక్త కణాల ఉత్తత్తిని పెంచే హార్మోన్లనూ కిడ్నీలు తయారు చేస్తాయి, ఎముకలు బలంగా ఉండేలా సహాయపడతాయి. శరీరంలో మినరల్స్ సమతుల్యతను నియంత్రించడంలో కిడ్నీలు తోడ్పడతాయి. ప్రస్తుతం కాలంలో కిడ్నీలో రాళ్ల సమస్య ఎక్కువైంది. మూత్రపిండాల్లో రాళ్లు ఉంటే.. ఆ బాధ వర్ణణాతీం. ప్రశాంతంగా కూర్చోనీయదు, హాయిగా పడుకోనీయదు. చాలా సందర్భాల్లో నీళ్లు ఎక్కువగా తాగితే.. రాయి బయటకు వస్తుంది. కొన్ని సందర్భాల్లో రాయి మరీ పెద్దాగా ఉంటే.. దాన్ని ఆపరేషన్ చేసి బయటకు తీస్తారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి అనేక కారణాలున్నాయి. అవేంటో చూసేయండి.



**రాళ్లు ఎలా ఏర్పడతాయి..**

కిడ్నీలో రాళ్లు రెండు రకాలుగా ఉంటాయి. కాల్షియం అక్సినేట్, కాల్షియం ఫాస్ఫేట్. మూత్రంలో ద్రావణం, సాలిడ్ కంపోనెంట్ ఉంటుంది. సాలిడ్ కంపోనెంట్‌లో సోడియం, పొటాషియం, యూరిక్ యాసిడ్ కాల్షియంతో పాటు రకరకాల పదార్థాలుంటాయి. సాలిడ్ కంపోనెంట్‌లు మూత్రంలో కరగకుండా ఉంటే అవి చిన్న చిన్న గుళికలుగా మారుతాయి. మూత్రంలోని కొన్ని రసాయనాలు బయటకు వెళ్లకుండా లోపలే పేరుకుపోవటం వల్ల తలెత్తే స్ఫటికాలు కిడ్నీలో రాళ్లకు దారితీస్తాయి. ఇవి మూత్రకోశంలో కదులుతుంటాయి కూడా. సాధారణంగా ఆక్జలేట్ లేదా ఫాస్ఫరస్‌లతో క్యాల్షియం కలవటం వల్ల ఏర్పడే రాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటాయి. మన శరీరం ప్రోటీన్‌ను వినియోగించుకునే క్రమంలో వెలువడే యూరిక్ యాసిడ్‌తోనూ రాళ్లు ఏర్పడొచ్చు.

**నీళ్లు సరిగ్గా తాగకపోయినా..**

మనం సరిపడా నీళ్లు తాగితే.. మన శరీరంలోని లోపలి నుంచి శుభ్రం అవుతుంది. మన శరీరం మొత్తం డీటాక్స్ అవుతుంది. సరిపడా నీళ్లు తాగకపోతే.. రాళ్లు ఏర్పడటానికి దారితీసే పదార్థాలు కిడ్నీలో పేరుకుంటాయి. నీరు ఎక్కువగా తాగటం వల్ల రాళ్లు ఏర్పడటానికి దారితీసే పదార్థాలు పలుచగా అవుతాయి. దీంతో ఇవి మూత్రంతో పాటు తేలికగా బయటకు వచ్చేస్తాయి. రోజూ కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగాలి.

**తగినంత కాల్షియం తీసుకోకపోయినా..**

ఆహారం ద్వారా తగినంత క్యాల్షియం తీసుకోకపోయినా కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. తగినంత క్యాల్షియం లేకపోతే.. మూత్రంలో ఆక్జలేట్ స్థాయులు పెరిగి రాళ్లు ఏర్పడొచ్చు. కాబట్టి వయసుకు తగినట్టుగా క్యాల్షియం తీసుకునేలా చూసుకోవాలి. 50 ఏళ్లు పైబడిన మగవారికి రోజుకు 1,000 మిల్లీగ్రాముల క్యాల్షియం అవసరం. అలాగే 800-1,000 ఐయూ విటమిన్ డి కూడా తీసుకోవాలి. ఇది క్యాల్షియాన్ని శరీరం గ్రహించుకోవటంలో తోడ్పడుతుంది.

**దయాబెటిస్..**

కిడ్నీ స్టోన్స్, దయాబెటిస్ మధ్య డైరెక్ట్ రిలేషన్ ఉందని పరిశోధకలు అంటున్నారు. మధుమేహం ఉన్నవారిలో ఎసిడిక్ మూత్రం ఉంటుంది. మూత్రంలో యూరిక్ యాసిడ్ అధికంగా చేరితే.. కిడ్నీలో రాళ్లు వచ్చే ముప్పు పెరుగుతుంది. కాబట్టి షుగర్ పేషెంట్స్ చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. మంచి లైఫ్‌స్టైల్ ఫాలో అవుతూ, క్రమం తప్పకుండా వ్యాయమం, సరిపడా నీరు తాగడం, పోషకాహారం తీసుకుంటే కిడ్నీలో రాళ్లను నివారించవచ్చని అంటున్నారు.

**ఉప్పు ఎక్కువగా తీసుకున్నా..**

సోడియం అధికంగా తీసుకున్నా.. కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. శరీరంలో సోడియం స్థాయిలు పెరిగితే.. మూత్రంలో క్యాల్షియం స్థాయులు పెరిగేలా చేస్తుంది. రోజుకు 2,300 మిల్లీగ్రాముల సోడియం తీసుకోవచ్చు.

**ప్రోటీన్ ఎక్కువగా తీసుకున్నా..**

మాంసాహారం నుంచి వచ్చే ప్రోటీన్ ఎక్కువగా తీసుకుంటే.. కిడ్నీలో రాళ్ల ముప్పు పెరుగుతుంది. మాంసం, చికెన్, గుడ్లు, సముద్ర రొయ్యలు, చేపల వంటివి ఎక్కువగా తింటే వీటి ద్వారా లభించే ప్రోటీన్.. మూత్రంలో యూరిక్ యాసిడ్ మోతాదులు పెరిగేలా చేస్తుంది. ప్రోటీన్‌ను మరీ ఎక్కువగా తీసుకుంటే రాళ్లు ఏర్పడకుండా చూసే సిట్రేట్ స్థాయులు కూడా పడిపోతాయి.

**కాఫీ,టీ ఎక్కువగా తాగినా..**

కాఫీలో కెఫిన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మూత్రంలో కాల్షియం మొత్తాన్ని పెంచే అవకాశం ఉంది. కూల్ డ్రింక్స్, కార్బోనేటేడ్ డ్రింక్స్‌కు కూడా దూరంగా ఉండాలి. వీటిలో ఫాస్ఫేట్ ఎక్కువగా ఉంటుంది. ఇవి రెండూ కిడ్నీ రాళ్లకు దారితీసేవే.

# రోజుకు రెండు యాలకులు తింటే ఇన్ని ప్రయోజనాలా ..

హెల్త్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఆహారానికి సువాసన అద్దే యాలకుల్లో ఔషధ గుణాలూ ఉంటాయి. ఇవి శరీరంలో వాత, పిత్త,

కఫాలను సమతూకంలో ఉంచడంలో సాయపడతాయి. జీర్ణశక్తి మొదలుకుని శ్వాసవ్యవస్థ పనితీరు మెరుగుదల వరకు వివిధ రకాలుగా యాలకులను ఉపయోగిస్తుంటారు ఆయుర్వేద వైద్యులు. రాత్రి పడుకునే ముందు రెండు యాలకులు తింటే ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఎన్నో!

జీర్ణం సాఫీగా: యాలకులతో జీర్ణ వ్యవస్థకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. తిన్న తర్వాత కడుపుబ్బరం అనిపిస్తే యాలకులు నమిలితే సత్వర ఉపశమనం దొరుకుతుంది. రాత్రి పడుకునే ముందు యాలకులు తింటే గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం లాంటి పొట్ట సమస్యలు తగ్గుతాయి.



సహజ డిటాక్స్: యాలకులకు డైయూరెటిక్ (మూత్ర విసర్జన) గుణాలు ఉంటాయి. దీంతో శరీరంలో పేరుకున్న మలినాలు బయటికి వెళ్లిపోతాయి. అలా కిడ్నీల ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి. శరీరానికి ఉన్న సహజ డిటాక్స్ క్రమాన్ని మెరుగుపరుస్తాయి.

నోటి దుర్వాసన దూరం: రాత్రి వేళ యాలకులు నమిలితే నోటి దుర్వాసన దూరమవుతుంది. దంతాలు, చిగుళ్లకు హానికరమైన బ్యాక్టీరియా నుంచి రక్షణ లభిస్తుంది.

బరువు తగ్గిస్తాయి: యాలకులు శరీర జీవక్రియలను నెమ్మదిగా పెంచుతాయి. వీటిలో ఉండే థర్మోజెనిక్ గుణాలు శరీరంలో క్యాలరీలను సమర్థంగా కరిగించేస్తాయి. రాత్రివేళ యాలకులు తింటే బరువు తగ్గడానికి దోహదపడతాయి.

ఒత్తిడిని తగ్గిస్తాయి: యాలకుల సుగంధం మనసుకు ప్రశాంతత చేకూరుస్తుంది. ఒక కప్పు యాలకుల టీ తాగితే శరీరంలో స్ట్రెస్ హార్మోన్ కార్టిసోల్ స్థాయులు తగ్గుతాయి. అలా ఒత్తిడి నుంచి ఉపశమనం దొరుకుతుంది. మూడ్ మెరుగుపడుతుంది.

చర్మం, జుట్టు ఆరోగ్యంలో: ఒక్క ఆరోగ్యం విషయంలోనే కాకుండా యాలకులు చర్మం, జుట్టు విషయంలోనూ మేలుచేస్తాయి. వీటిలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు రక్త సరఫరాను మెరుగుపరుస్తాయి. దీంతో చర్మం మెరిసేలా తయారవుతుంది. యాంటి బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలపై పోరాడతాయి. యాలకుల్లో ఉండే పోషకాలు జుట్టును బలంగా చేస్తాయి. చుండ్రును నివారిస్తాయి.

# ఎముకకు ప్రొటీన్ బలం!



హెల్త్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఎముక పుష్టికి తోడ్పడే పోషకాలు అనగానే క్యాల్షియం, విటమిన్ డి ముందుగా గుర్తుకొస్తాయి. కానీ ప్రొటీన్ తక్కువదేమీ కాదు. ఎముక పరిమాణంలో సుమారు సగం వరకూ ప్రొటీనే ఉంటుంది. ఎముక క్షీణించినప్పుడు దాన్ని భర్తీ చేయటానికిది అత్యవసరం. దీని విషయంలో ప్రొటీన్ రెండు పాత్రలు పోషిస్తుంది. ఒకటి- పేగుల్లో క్యాల్షియంను గ్రహించుకోవటానికి తోడ్పడటం. రెండు- మూత్రంలోంచి క్యాల్షియం బయటకు పోవటానికి సాయపడటం. ఎముక బలంగా, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రొటీన్, క్యాల్షియం రెండూ తగినంత మోతాదుల్లో ఉండాలి మరి. పాలు, పెరుగు, మజ్జిగ వంటి వాటిల్లో క్యాల్షియం, ప్రొటీన్ సమృద్ధిగా ఉంటాయి. వీటిని రోజుకు ఒక కప్పు మాత్రమే తీసుకునేవారితో పోలిస్తే రెండు కప్పుల చొప్పున తీసుకున్నవారికి ఎముక విరిగే ముప్పు 33% వరకూ తగ్గుతున్నట్టు ఆస్ట్రేలియాలో నిర్వహించిన అధ్యయనంలో బయటపడింది. ఇది ఎముక ముప్పు విరగటాన్ని తగ్గించే కొన్ని మందులతో సమానం కావటం గమనార్హం.

# బాంబ్ పేల్చిన కుంబ్లే..

## సీనియర్లకు ఎసరు పెట్టేలా గంభీర్‌కు సూచనలు!



స్పోర్ట్స్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఛాంపియన్స్ ట్రోఫీ-2025ని టీమిండియా శుభారంభంతో ప్రారంభించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత జట్టు సునాయాస విజయాన్ని అందుకుంది. మహమ్మద్ షమీ ఐదు వికెట్లతో కమ్ బ్యాక్ ఇవ్వగా శుభమన్ గిల్ సెంచరీతో దూకుడు పెంచాడు. రోహిత్ శర్మ 36 బంతుల్లో 41 పరుగులు చేయగా, విరాట్ కోహ్లి 38 బంతుల్లో కేవలం 22 పరుగులకే పెవిలియన్ బాట పట్టాడు. మ్యాచ్ అనంతరం టీమిండియా మాజీ కోచ్ అనిల్ కుంబ్లే వ్యాఖ్యలు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశాయి.

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్‌కు కఠిన సవాళ్లు ఎదురవుతాయని కుంబ్లే చెప్పాడు. భారత జట్టులో మార్పులు చేసే క్రమంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించాడు. సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా, మహమ్మద్ షమీ విషయంలో కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటూ చెప్పాడు.

"టీమిండియా హెడ్ కోచ్‌గా గంభీర్‌కి ఇది చాలా కీలక టోర్నీ. ఈ టోర్నీ ముగిసిన తర్వాత అతని ముందు చాలా సవాళ్లు ఉంటాయి.. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ టోర్నమెంట్‌తో సీనియర్ల భవిష్యత్ కూడా తేలిపోనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినా.. ఓడినా జట్టులో మార్పులు ఖాయం. టోర్నీ ముగిసిన వెంటనే వన్డే వరల్డ్‌కప్ 2027కి జట్టుని సిద్ధం చేయాలి. ఈసారి యువకులతో కూడిన జట్టును సిద్ధం చేయాల్సి ఉంటుంది. వన్డేలకు అలవాటు పడాలంటే ఇప్పటి నుంచి ప్రాక్టీస్ అవసరం" అని కుంబ్లే చెప్పాడు.

ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత సీనియర్లను జట్టులో కొనసాగించాలా? లేక యువకులకు అవకాశం ఇవ్వాలా? అనేది మేనేజ్‌మెంట్ నిర్ణయమని కోహ్లి అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే కోచ్‌గా గంభీర్‌కు ఈ విషయంలో క్లారిటీ ఉండాలని చెప్పాడు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీ20 టీమ్ చాలా బాగుందని, వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌కు పర్ఫెక్ట్ టీమ్ రెడీ అయిందని చెప్పాడు. వన్డే వరల్డ్‌కప్‌కు మరో రెండేళ్ల సమయం ఉండటంతో సీనియర్లను తొలగిస్తే ఆలోగా యువకులను సిద్ధం చేయాలని గంభీర్‌కు కుంబ్లే సలహా ఇచ్చాడు.

టీ20 వరల్డ్‌కప్‌లో ఛాంపియన్స్‌గా నిలిచిన అనంతరం సీనియర్ ప్లేయర్లు అయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత రోహిత్, విరాట్ మిగతా ఫార్మాట్లకు కూడా గుడ్ బై చెప్పాలంటూ ఇప్పటికే మాజీలు సూచనలు కూడా చేస్తున్నారు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత్ పేలవ ప్రదర్శన అనంతరం వాళ్లపై ప్రజర్ ఇంకాస్త పెరిగింది. రిటైర్మెంట్ విషయమై రోహిత్ స్పందిస్తూ తాను ఎప్పుడు రిటైర్మెంట్ ప్రకటించాలో తనకు తెలుసంటూ గట్టిగానే కౌంటర్ ఇచ్చాడు.

# సెమీస్‌లో ఊహించని ట్విస్ట్..

## హెల్మెట్ దెబ్బకు మారిన రిజల్ట్

స్పోర్ట్స్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో కేరళ, గుజరాత్ జట్లు తలపడ్డాయి. 74 ఏళ్ల నిరీక్షణ తర్వాత కేరళ రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకోవడానికి చాలా దగ్గరగా వచ్చింది.



ఫైనల్స్‌కు చేరుకోవడానికి రెండు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ సమయంలో, ఒక వింత నాటకం కూడా కనిపించింది. నిజానికి, కేరళ తన మొదటి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేసింది. ప్రియాంక్ పంచల్ సెంచరీ, జయమీత్ పటేల్, ఆర్య దేశాయ్ అర్ధ సెంచరీల ఆధారంగా గుజరాత్ కూడా కేరళ స్కోరుకు చాలా దగ్గరగా వచ్చింది. శుక్రవారం, కేరళపై ఆధిక్యం సాధించడానికి గుజరాత్‌కు రెండు పరుగులు అవసరం కాగా, కేరళకు ఒక వికెట్ అవసరం కాగా, మైదానంలో అద్భుతమైన డ్రామా జరిగింది.

గుజరాత్ ఆటగాళ్లు అర్జన్ నాగవాస్వాలా, జడేజా క్రీజులో ఉన్నారు. గుజరాత్ 9 వికెట్లు కోల్పోయింది. మ్యాచ్ ఫలితం తేలకపోయినా, మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా వారి జట్టు ఫైనల్స్‌కు చేరుకునేలా, ఏ విధంగానైనా తమ జట్టుకు ఒక పరుగు ఆధిక్యాన్ని అందించాల్సిన బాధ్యత వారిద్దరిపై ఉంది. గుజరాత్ 457 పరుగులకు చేరుకోకుండా ఆపాలని కేరళ కూడా కోరుకుంది. ఆధిక్యాన్ని పొంది ఫైనల్‌కు చేరుకోవచ్చు. ఇద్దరి మధ్య ఉత్కంఠభరితమైన యుద్ధం జరిగింది. కానీ, అదృష్టం మాత్రం గుజరాత్ జట్టుకు దూరంగా నిలిచింది.

ఆదిత్య సర్వాటే వేసిన బంతి అతను లెగ్ ఫీల్డర్ హెల్మెట్‌కు తగిలింది. బంతి నేరుగా స్లిప్‌లో నిలబడి ఉన్న సచిన్ బేబీ చేతుల్లోకి వెళ్లింది. దీనితో, నాగవాస్వాలా 10 పరుగుల వద్ద పెవిలియన్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. ఈ వికెట్‌తో, గుజరాత్ మొదటి ఇన్నింగ్స్‌లో 455 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ అదృష్ట క్యాచ్ కేరళకు తొలి ఇన్నింగ్స్‌లో రెండు పరుగుల ఆధిక్యాన్ని ఇచ్చింది. దీంతో ఏడు దశాబ్దాల తర్వాత టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకోవడంలో సహాయపడింది.

# సౌరవ్ గంగూలీ బయోపిక్




స్పోర్ట్స్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): భారత క్రికెట్ జట్టు రూపు రేఖలు మార్చిన సౌరవ్ గంగూలీ బయోపిక్ పై ఎప్పటి నుంచో చర్చ జరుగుతోంది. ఎందరో స్టార్ హీరోలు, డైరెక్టర్ల పేర్లు వినిపించాయి. అయితే మూవీ మాత్రం పట్టాలెక్కడం లేదు. తాజాగా ఈ బయోపిక్ పై సౌరవ్ గంగూలీనే స్వయంగా స్పందించాడు. గురువారం ఒక కార్యక్రమానికి హాజరు కావడానికి ఆయన బుర్ద్వాన్ వెళ్లారు. అక్కడ, తన బయోపిక్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను విన్నంతవరకు.. టైటిల్ రోల్‌లో రాజ్ కుమార్ రావ్ నటించనున్నారు. అయితే డేట్స్ సర్దుబాటులో కొంత సమస్య ఉంది. అందువల్ల సినిమా విడుదలయ్యేందుకు మరో ఏడాదిపైనే సమయం పట్టొచ్చు' అని గంగూలీ చెప్పుకొచ్చారు" ఈ వార్త వెలువడిన వెంటనే అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. యాదృచ్ఛికంగా, సౌరవ్ బయోపిక్ గురించి చాలా కాలంగా చర్చ జరుగుతోంది. సౌరవ్ పాత్రను ఎవరు పోషిస్తారనే దానిపై ఆసక్తి కూడ పెరిగింది. బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా నుంచి రణబీర్ కపూర్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే చివరికి రాజ్ కుమార్ రావు పేరునే ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

కాగా గతేడాది స్త్రీ 2 సినిమాలో ప్రధాన పాత్ర పోషించాడు రాజ్ కుమార్ రావు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మొత్తం 800 కోట్ల రూపాయల వసూళ్లు సాధించి ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది. అంతకు ముందు ప్రముఖ పారిశ్రామికవేత్త, బొల్లాంట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ బొల్లా జీవితం ఆధారంగా తెరకెక్కిన శ్రీకాంత్ సినిమాలో రాజ్ కుమార్ రావు అద్భుతంగా నటించాడు. ఈ నేపథ్యంలోనే భారత జట్టులో దాదాగా పేరొందిన సౌరవ్ గంగూలీ బయోపిక్‌లోనూ రాజ్ కుమార్ రావును ఎంపిక చేసుకున్నారని తెలుస్తోంది.

# 'వాళ్లను చూసి నేర్చుకోండి!

## వెళ్లి జింబాబ్వే, ఐర్లాండ్‌లతో పోటీ పడండి'




స్పోర్ట్స్ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): తాజాగా స్వదేశంలో ప్రారంభమైన ఛాంపియన్స్ ట్రోఫీని ఘోర పరాజయంతో ప్రారంభించింది పాకిస్థాన్ జట్టు. న్యూజిలాండ్?తో జరిగిన తొలి మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. దీంతో ఇప్పుడు పాక్ జట్టుపై ఆ దేశ మాజీ క్రికెటర్ల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా పాక్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ఆ జట్టు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జింబాబ్వే-ఐర్లాండ్‌తో సిరీసుల్లో ఆడుకోవాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అక్కడ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీలోకి రావాలంటూ చురకలంటించాడు.

"ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ వైదొలగాలి. జింబాబ్వే, ఐర్లాండ్‌ల మధ్య జరగనున్న సిరీస్‌లో పోటీపడాలి. అక్కడ గెలిచాక మా టీమ్?కు ఛాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే అర్హత ఉన్నట్లు. అయితే నేను ఇలా అనడానికి ఓ కారణం ఉంది. మా టీమ్? ఆటతీరు ఇలానే ఉంది. గత ఆరేడేళ్ల నుంచి మా జట్టు క్రికెట్ స్టాండర్ట్స్ అతి ఘోరంగా పడిపోయాయి" అని కమ్రాన్ అక్మల్ అన్నాడు.

వాళ్లను చూసి నేర్చుకోండి

"పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కివీస్ నిలకడైన ఆటతీరును కనబరిచింది. మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ స్ట్రైక్‌ను రొటేట్ చేస్తూ ఆ జట్టు బ్యాటర్లు పరుగులు సాధించారు. తొలుత నెమ్మదిగా ఆడి మ్యాచ్ తమ కంట్రోల్‌లోకి వచ్చిందని భావించాక మళ్లీ దూకుడు పెంచారు. పరిణితి చెందిన జట్టు చేసే పని కూడా అదే. కనీసం కివీస్‌ను చూసైనా సరే పాక్ నేర్చుకోవాలి. టామ్ లేథమ్, విల్ యంగ్ నిలకడగా ఆడి సెంచరీ సాధించారు" అంటూ కమ్రాన్ అక్మల్ పేర్కొన్నాడు.

ఇక మ్యాచ్ విషయానికొస్తే, బుధవారం కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 60 పరుగుల తేడాతో ఓడింది. 321 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాక్ 47.2 ఓవర్లలో 260 స్కోర్?కు ఆలౌట్ అయ్యింది. కుష్‌దీల్ షా (69 పరుగులు, 49 బంతుల్లో), బాబార్ అజామ్ (64 పరుగులు, 90 బంతుల్లో) హాఫ్ సెంచరీలు సాధించగా, సల్మాన్ అఘ (42 పరుగులు) ఆకట్టుకున్నాడు. కివీస్ బౌలర్లలో శాంట్నర్, ఓ రూర్కీ చెరో 3, హెన్రీ 2, బ్రెస్‌వెల్, స్మిత్ తలో 1 దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన



# ధనుష్ మేకింగ్ స్టైల్‌పై కీర్తిసురేశ్ ప్రశంసలు

మూవీ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హీరో ధనుష్ మేనల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్' . ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు.

"ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండిపోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు" అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.



# అదే నిజమైన మనశ్శాంతి!

మూవీ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): 'ఒంటరితనం విలువైనది. మనతో మనం మాట్లాడుకునే అవకాశం ఒంటరితనం వల్లే లభిస్తుంది. మానసిక ఇబ్బందులతో బాధపడుతున్న వాళ్లకు ఒంటరితనాన్ని మించిన మందు లేదు.' అని చెప్పుకొచ్చింది అందాలభామ సమంత. తనకు మనసు బాగుండకపోతే వెంటనే తమిళనాడు కోయంబత్తూర్‌లోని ఇషా ఫౌండేషన్లో వాలిపోతుంది సమంత. అక్కడ ధ్యానం, యోగ సాధనతో ఆమె ఉపశమనం పొందుతూ ఉంటుంది. సద్గురు వద్ద సాధన చేస్తూ తాను దిగిన ఫొటోలు, వీడియోలను సోషల్‌మీడియాలో షేర్ చేసింది సమంత. ఈ సందర్భంగా ఆమె ఇంకా మాట్లాడుతూ 'మనుషులు ఒంటరిగా ఉండటం అంటే ఈ రోజుల్లో కష్టం. చేతిలో ఫోన్ ఉంటే ప్రపంచం మనతో ఉన్నట్టే. ఫోన్ చూస్తూ కూర్చోవడం కూడా ఒంటరితనం అవ్వదు. నిజంగా మానసిక ఒత్తిడి నుంచి బయటపడాలనుకునేవారికి నా సలహా ఒక్కటే. ముందు మీ చేతిలో ఉన్న ఫోన్ తీసి అవతల పారేయండి. కమ్యూనికేషన్‌కి దూరంగా ఉండండి. నీకు నువ్వే తోడవ్వాలి. అలా ఒక్కరోజు ఉండి చూడు. మనశ్శాంతి అంటే ఏంటో తెలుస్తుంది.' అని పేర్కొన్నది సమంత.

# ఆ భాషల్లో పాడటం కష్టం



మూవీ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): బాలీవుడ్ విఖ్యాత గాయనీమణులు లతా మంగేష్కర్, అనురాధా పడ్వాల్, ఆశా భోంస్లే ఇతర భాషల్లో పాటలు పాడినా.. అరుదుగా మాత్రమే పాడేవారు. కానీ శ్రేయాఘోషల్ అలా కాదు. కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి దేశంలోని అన్ని భాషల్నీ చుట్టేస్తూ జాతీయ గాయనిగా హవా సాగిస్తున్నారు. ప్రస్తుతమైతే శ్రేయా ఘోషల్‌ని ఓ భాషకు కట్టేయలేం. అన్ని భాషలూ ఆమెవే. రీసెంట్‌గా 'తండేల్'లో ఆమె పాడిన 'హైలెస్సో.. హైలస్సా..' పాట తెలుగు రాష్ట్రాల్లో మోగిపోతున్నది.త్వరలో ఆమె తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూర్‌లలో మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనుంది. ఈ సందర్భంగా చెన్నైలో ఆమె విలేకరులతో ముచ్చటించింది. సంగీతమంటే తనకెంతో ఇష్టమని, భాషలకు అతీతమైన అభిమానం తన పాటలకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా శ్రేయాఘోషల్ అన్నారు. మిగతా భాషలతో పోలిస్తే తమిళ, మలయాళ భాషల్లో పాటలు పాడటం కాస్త కష్టంగా ఉంటుందని, అందుకే ఆ భాషల్లో పాడటానికి కాస్త సమయం ఎక్కువ తీసుకుంటానని శ్రేయా తెలిపారు. ఈ ప్రెస్‌మీట్ అనంతరం 'మున్బే వా ఎన్ అన్బే వా..' అంటూ తమిళ గీతాన్ని ఆలపించి అభిమానుల్ని అలరించారు శ్రేయా ఘోషల్.

# మణిరత్నంతో సినిమా చేయబోతున్న నవీన్ పోలిశెట్టి.!



మూవీ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): టాలీవుడ్ యువ కథానాయకుడు నవీన్ పోలిశెట్టి బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. తాజాగా ఆయన దిగ్గజ దర్శకుడు మణిరత్నంతో సినిమా చేయబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, జాతి రత్నలు, మిస్ శెట్టి, మిస్టర్ పోలిశెట్టి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నవీన్. సినిమా సినిమాకు గ్యాప్ తీసుకునే నవీన్ ఇటీవల యాక్సిడెంట్ కావడంతో చేయికి గాయం అయ్యి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. ప్రస్తుతం చేస్తున్న చిత్రం అనగనగా ఒకరాజు ఈ సినిమా అనంతరం నవీన్ మణిరత్నం సినిమాలో చేయబోతున్నట్లు తెలుస్తుంది. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి త్వరలోనే అన్ని వివరాలు వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# చిరంజీవి మాట.. నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది - సందీప్ కిషన్

మూవీ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): 'మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటుడు సందీప్ కిషన్ . మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని అన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు.

"ఎవరి సపోర్ట్ లేకుండా నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూశాను. 'ఒక్క అమ్మాయి తప్ప' సినిమా ముందు వరకూ ఎంతోమంది దర్శక, నిర్మాతలు తమ కథలను నాతో పంచుకునేవారు. కథలపై నాకొక మంచి జడ్జిమెంట్ ఉంటుందని వారు నమ్మేవారు. కానీ ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. నా సినిమాలు వరుస పరాజయాలు అందుకోవడంతో నా జడ్జిమెంట్ సరైనది కాదని వారు భావించారు. కెరీర్‌లో వరుస అపజయాలు, రిలేషన్‌షిప్ బ్రేకప్.. జీవితంలో ఏం జరుగుతుందో అర్థంకాక ఎంతో బాధపడ్డా. రోజుకు అరకిలో ఐస్‌క్రీమ్, చాక్లెట్స్ తినేశా. నా బరువు 97 కిలోలకు చేరింది. ఆ సమయంలో నా స్నేహితుడు రూ.కోటి ఇస్తే 'నిను వీడని నీడను నేనే' చేసి రూ.6 కోట్లు రాబట్టా. అక్కడినుంచి జాగ్రత్తగా కథలు ఎంచుకుంటూ కష్టపడుతున్నా" అని సందీప్ కిషన్ అన్నారు.

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. "ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలను కుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా" అని చెప్పారు.



# 'శివంగి'లా ఆనంది



మూవీ న్యూస్,21 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): 'శివంగి'గా ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి ఆనంది. ఆమె టైటిల్ పాత్రలో నటించిన ఈ నాయికా ప్రాధాన్య చిత్రాన్ని దేవరాజ్ భరణి ధరన్ తెరకెక్కించారు. పి.నరేశ్ బాబు నిర్మించారు. వరలక్ష్మీ శరత్ కుమార్, జాన్ విజయ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా మార్చి 7న రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి ఇటీవల విడుదల చేశారు. అందులో ఆనంది నల్ల చొక్కా, పంచెకట్టుతో.. చలువ కళ్లద్దాలు పెట్టుకుని సోఫాలో స్టైలిష్‌గా కనిపించింది. "ఓ విభిన్నమైన కథతో రూపొందిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు ముగింపుకొచ్చాయ"ని చిత్ర వర్గాలు తెలిపాయి.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com